జ్ఞానమయి అమ్మ



సంకలనం

కోన వెంకటేశ్వరరావు


ప్రచురణ : శ్రీమాతా ప్రచురణలు, జిల్లెళ్ళమూడి.



తల్లి శ్రీమతి వెంకాయమ్మ
తండ్రి శ్రీ కోన వెంకట సుబ్బారావు

అం ఆ

జ్ఞానమయి అమ్మ



సంకలనకర్త

కోన వెంకటేశ్వరరావు

అడ్వకేటు, పొన్నూరు.

ప్రచురణ

శ్రీమాతా ప్రచురణలు - జిల్లెళ్ళమూడి

జ్ఞానమయి అమ్మ

ప్రథమ ముద్రణ : 22-11-1999

(ప్రమాది - కార్తీక పౌర్ణమి)

ద్వితీయ ముద్రణ : 5-5-2016 (అమ్మ కళ్యాణోత్సవం)

కాపీలు : 1000

ప్రతులకు : **శ్రీమాతా ప్రచురణలు**

జిల్లెళ్ళమూడి - 522 113.

సెల్ : 9494675865,

ఫోన్ : 08643-227312.

వెల : రూ. **50/-**

ముద్రణ : **శ్రీ లక్ష్మీ గణపతి ఆర్ట్ ప్రింటర్స్**

2/4 బ్రాడీపేట, గుంటూరు-2.

ఫోన్ : 0863-2235036.

నివేదన

అన్నాప్రగడ లక్ష్మీనారాయణ,

యం.కాం., ఎ.పి.ఇ.ఎస్.,

రీజినల్ డైరెక్టర్ ఆఫ్ కాలేజి ఎడ్యుకేషన్ (రిటైర్డు)

శబ్ద ప్రపంచం మొత్తంలో 'అమ్మ' అనే పదం అన్నిటికంటే మధురమైనది. శిశువు ప్రప్రథమంగా ఉచ్చరించే అక్షరాలలో అం, అః ముఖ్యమైనవి. చిన్న పిల్లవాడు నేర్చుకునే బుడి, బుడి మాటలు కూడా ఈ రెండు అక్షరాలతోనే మొదలవుతాయి. 'అ' కారంతో మొదలయ్యే అచ్చులన్నింటికీ ప్రాణములనే పేరుంది. 'క' కారంతో మొదలయ్యే హల్లులన్నిటికీ ప్రాణులనే పేరు. ప్రాణముంటేనే ప్రాణులకు మనుగడ. లేకపోతే అవన్నీ నిర్జీవాలే.

ఆ విధంగాను, మరే విధంగానూ చూచినా అమ్మ అనే పదం ఆది శబ్దమైన ఓంకారంతో సమానమైనది. ఆ, ఉ, మ, ల కలయికయే ఓంకార శబ్దంగా పరిణామం చెందితే అమ్మ అనే శబ్దంలో కూడా అంతర్గతంగా ధ్వనించేది ఈ 'ఓం'కార నాదమే.

అమ్మ, అమ్మ అని జపిస్తూ ఉన్నా, అది ఓంకారోపాసనతోనే సమానమవుతుంది.

జిల్లెళ్ళమూడిలో అమ్మ రూపంలో వెలిసిన శ్రీ అనసూయాదేవి అవతారానికి ఒక ప్రత్యేకమయిన విశిష్టత ఉంది. వేదకాలం నుండి, ఉపనిషత్తుల కాలం నుండి, భారతజాతిలో పరంపరగా వస్తూ వున్న గహనమైన అనేక ఆధ్యాత్మిక సత్యాలను గోరుముద్దలుగా చేసి, పాలు, పెరుగులో రంగరించి, లక్షలాది ఆధ్యాత్మిక శిశువులకు ఆమె ఉగ్గుపాలు పోశారు. బహుశః అందుకేనేమో ఆమె నాకు "శిష్యులు ఎవరూ లేరు. అంతా శిశువులే" అన్నారు.

అమ్మ ఏమీ చదువుకోలేదు. వేదాలు అధ్యయనం చేయలేదు. శాస్త్రాలు వల్లించలేదు. కాని "చదువులలో మర్మమెల్ల చదివిన" ఆమె మాటలలో తరతరాల ఆధ్యాత్మిక సంపదంతా తొంగిచూస్తుంది. "అల్పాక్షరముల అనల్పార్థములు" ఆమె నోట పుంఖానుపుంఖాలుగా వెలువడ్డాయి. కొందరు పండితులు ఆమెతో మాట్లాడటానికి వచ్చేవారు. మరికొందరు ఆమెతో పోట్లాడటానికి వచ్చేవారు. మాట్లాడటానికి వచ్చిన వారు ఆమె మాటలు విని మ్రాన్పడిపోయే వారు.

పోట్లాడటానికి వచ్చిన పండితులు ఆమె వాదపటిమకు అవాక్కయి పోయేవారు. ఆమెతో వాదన వాదనగా కాక, ఒక లాలింపుగా, తల్లి బిడ్డను జోకొట్టినట్టుగా ఉండేది. ఎందరో మహానుభావుల్లాగా ఆమె దేశమంతా తిరిగి ఉపన్యాసాలు చేయలేదు. ఉన్నచోటనే ఉండి తాను కదలకుండా యావత్తు ఆధ్యాత్మిక ప్రపంచాన్ని కదిలేటట్టు చేసిన సర్వంసహా శక్తి మాతృశ్రీ. ఎంతో మంది ఆమెను గురించి ఎన్నో పుస్తకాలు వ్రాశారు. కాని ఆమె తనంటూ ఒక్క పుస్తకం కూడా వ్రాసింది లేదు. ఒక్క ముక్క కూడా గ్రంథస్థం చేసింది లేదు.

ఆధ్యాత్మిక జగత్తులో కొన్ని విప్లవాత్మకమైన పోకడలను ప్రవేశపెట్టిన విప్లవమూర్తి, మాతృశ్రీ. "అందరికీ సుగతే"నని, "పునర్జన్మ అంటూ లేద"ని, 'నేటి వర్ణాశ్రమ ధర్మాలు కేవలం కల్పితం' అని, 'సాధ్యమైనదే సాధన' అని, 'తిథులెన్నటికీ విధిని మార్చలేవని', ఇవేనా ? ఇంకెన్నో, మరెన్నో సూక్తులతో ఒక ప్రత్యేక ఆధ్యాత్మిక పంథాకు నుడికారం చుట్టింది. తానెవరి వద్ద ఉపదేశం పొందకుండా స్వయం వ్యక్తగా వెలిసిందీ మాతృమూర్తి. అదే విధంగా తాను కూడా ఎవ్వరికీ ఉపదేశం ఇచ్చిన దాఖలాలు లేవు.

మాతృశ్రీ అనసూయాదేవికి, శ్రీ రమణ మహర్షికి ఎన్నో పోలికలున్నాయి. ఇరువురూ విద్యాధికులు కారు. వారి బోధనలలో గూడా ఏ శాస్త్రం నుంచి, ఉపనిషత్తుల నుంచి కొటేషన్సు ఇవ్వలేదు. ఏ గ్రంథాలను రచించలేదు. ఎక్కడా తాము గురువులుగా చెప్పుకోలేదు. ఎవ్వరినీ శిష్యులుగా స్వీకరించలేదు. ఉపదేశాలు ఎవ్వరికీ ఇవ్వలేదు. అందరి సొత్తైన జ్ఞానామృతాన్ని జాతి, మత, కుల, ప్రాంతీయ భేదం లేకుండా అందరికీ వెదజల్లి వెళ్ళిపోయారు.

ఇరువురు కూడా స్వానుభవాన్నే ప్రాతిపదికగా తీసుకొని, సాధనా రహస్యాలను, వేదాంత సూక్తులను, ప్రవచించారే కాని, ఒక శాస్త్రాన్నో, ఒక సిద్ధాంతాన్నో, లేదా సంప్రదాయాన్నో ప్రచారం చేసినవారు కాదు. అంతే కాకుండా వారు ప్రవచించిన మార్గాల ద్వారా పూర్వం చెప్పబడిన వేదాంత సిద్ధాంతాలను మెఱుగు దిద్ది, నూతనమైన ఆధ్యాత్మిక సాధనా పద్ధతులను ఆర్త జనానికి అందించారు.

మాతృశ్రీ అటు పురాతనమైన ఆధ్యాత్మిక సంప్రదాయాలకు, సనాతన సాధనా మార్గాలకు, ఇటు ఆధునికమైన వైజ్ఞానిక ధోరణులకు, సారథిగా, వారధిగా కూడా పనిచేశారని చెప్పాలి. ఆధునిక, వైజ్ఞానిక యుగంలో మానవులు తార్కిక పద్ధతిలో ప్రశ్నలకు సమాధానం చెప్పందే సనాతన, ఆధ్యాత్మిక సత్యాలేవీ అంగీకరింపబడవని,

అమ్మ తేల్చిచెప్పారు. ఆధునికలు చాలా మంది అమ్మ బోధనల వైపు ఆకర్షితులవటానికి ఇది ఒక ప్రత్యేక కారణం.

డాక్టరు శ్రీపాద గోపాలకృష్ణమూర్తి వంటి కరుడు గట్టిన శాస్త్రజ్ఞులను కూడా అమ్మ తన అసాధారణమైన ప్రజ్ఞ చేత నిరుత్తరులను చేసింది. ఎంతో మంది తార్కికులు, పండితులు, శాస్త్రజ్ఞులు అమ్మ ముందు తమ ప్రజ్ఞా పాటవాలను ప్రదర్శింపబోయి శృంగభంగమైన నిదర్శనాలు కోకొల్లలు.

"అభేద దర్శనం, జ్ఞానం". జ్ఞానం అంటే సర్వాన్ని బ్రహ్మమయంగా దర్శించటమే. "దృష్టిం జ్ఞానమయం కృత్వా పశ్యేత్ బ్రహ్మమయం జగత్" జ్ఞానమయమయిన దృష్టి కల వారికి సర్వ జగత్తు బ్రహ్మమయంగానే కనిపిస్తుంది. అందుకే అమ్మ "ఇదంతా నేనే", "ఇవన్నీ నేనే" అంటుంది. ఆమె దృష్టిలో కనిపించే చరాచర జగత్తంతా ఆత్మ పరస్పందనమే. ఆత్మ కంటే వేరేదీ లేదు. అమ్మ కంటే వేరేదీ లేదు. ఆత్మయే ఇన్ని రూపాలుగా ఇన్ని విధాలుగా కనిపిస్తున్నది. అందుకే అమ్మ "అన్ని నేనులు నేనైన నేను" అన్నారు. ఎవరో ఒకాయన 'పిపీలికాది బ్రహ్మపర్యంతము' అంటే, పిపీలికం మాత్రం బ్రహ్మ కాదా అని అమ్మ ప్రశ్నించింది. ఈ ప్రశ్నలోనే అమ్మతత్త్వం, సర్వవేదాంత రహస్యమంతా ఇమిడి ఉన్నది.

కొంతమంది అమ్మతో మాట్లాడి, అనుభవాన్ని పొందితే మరికొంతమంది అమ్మతో పోట్లాడి అనుకున్నది సాధించుకున్నారు. పిల్లలంతా ఒకే విధంగా ఉండరు. తల్లి దగ్గర గారాం చేసేవారు కొందరు, మారాం చేసే వారు మరికొందరు. అమ్మతో పోట్లాడి కావలసినది సాధించుకున్న వారి కోవకు చెందినవారు ఈ వర్ధమాన రచయిత, సంకలనకర్త శ్రీ వెంకటేశ్వరరావుగారు. ఒక వైపు విశిష్టమైన సంకలనం, మరొక వైపు వివరణ, రెండూ గంగా యమునల్లాగా సాగాయి. పుస్తకానికి పేరు గూడా ముచ్చటగా అమరింది.

శ్రీ వెంకటేశ్వరరావుగారు అమ్మ పాదపద్మములకు ముచ్చటగా సమర్పించు కుంటున్న మూడవ పుష్పం ఇది. మనమందరమూ కూడా అందుకుందాం. ఆఘ్రాణిద్దాం.

"నాదబ్రహ్మమయీ, పరాత్పరమయీ, జ్యోతిర్మయీ, చిన్మయీ."

విజయవాడ
25-10-1999

బుధజన విధేయ
అన్నాప్రగడ లక్ష్మీనారాయణ.

నీరాజనం

సిరివరం రంగనాథరావు,
ఎం.ఏ., బి.కాం., ఎల్.ఎల్.బి.,
"కృష్ణప్రభ", బెంగుళూరు.

ఈ పుస్తకములోని మాటలు అమ్మ మనస్సులోని ఆలోచనలు కావు. ఇంద్రియముల ద్వారా గ్రహించి బుద్ధితో సంగ్రహించి సమయానుకూలంగా వదలిన పాండిత్యపు చిలుక పలుకులు కావు. ఆంతరంలో దాగియున్న పూర్ణ ప్రజ్ఞత్వం నుండి వాటంతట అవే జారిపడిన తునకలు - అవే వేదవాక్కులు.

అమ్మ అందరి మాటలు వినడం ఎక్కువ, తాను మాట్లాడేది తక్కువ. కొన్ని సమయ సందర్భాల్లో పలుకు తునకలు ఆమె నోటి నుండి బయటపడుతవి. అవి ఒకరికి కాదు కదా అందరికీ అన్వయిస్తాయి. సమయ సందర్భాలు తెలిస్తే మాటలలోని మాధుర్యం గ్రహించడం సులభం. లేనిచో వ్యాఖ్యానం చేయడం తప్పదు. ఉదాహరణకు -

"ఉన్న ఒక ఆశా పోతే ఆత్మ సాక్షాత్కారం ఔతుంది" అన్నది అమ్మ. ఈ మాటల్లో ఇమిడి ఉంది కఠోపనిషత్ సారాంశము. దీనిని అమ్మ ఎప్పుడు, ఎందుకు, ఎవరితో చెప్పిందో చూద్దాం.

నేను మొట్టమొదటిసారిగా 15-8-1961 జిల్లెళ్ళమూడి వెళ్ళి అమ్మను చూశాను. అమ్మ నాకేమి కావాలో అడుగమన్నది. ఆత్మసాక్షాత్కారం కావాలన్నాను. అప్పుడు అమ్మ నాతో పలికిన పలుకులే పై మాటలు. పాతికేళ్ళ తర్వాత ఇది వేదవాక్కని తెలుసుకున్నాను. కొన్ని సమయాలలో ఎవరైనా అమ్మను ప్రశ్నిస్తే ఆమె తిరిగి వేసిన ప్రశ్నే సమాధానమౌతుంది. ఒకానొక రోజు పండితులమనుకున్న కొందరు అమ్మ వద్ద కూర్చొని "అన్నం బ్రహ్మేతి విజానీయాత్" అన్న విషయాన్ని తర్కిస్తూ ఉన్నారు. వారు తర్కించే విషయాన్ని, విధానాన్ని చూసి ఆనందించింది కాని, వారి తర్కములో అమ్మ పాల్గొనలేదు. ఇది అమ్మ ప్రత్యేకత. ఈ తర్కానికి అంతు లేదని తెలిసి అన్నయ్యలు "అన్నము బ్రహ్మ ఎలా ఔతుందమ్మా" అని

అమ్మనే అడిగినారు. అప్పుడు "అన్నము బ్రహ్మమైతే అశుద్ధం ఏమౌతుంది నాన్నా" అని ప్రశ్నించింది. ఇది ప్రశ్న కాదు. అందరి కళ్ళు తెరిపించిన సమాధానము.

అమ్మకు శిష్యులు లేరు. అందరూ శిశువులే. బిడ్డలు తల్లిని చూసి అనుసరించినట్లు, అనుకరించిన రీతి మనం అమ్మ తత్త్వాన్ని అలవరచుకొనాలి. నేను ఆఖరుసారి అమ్మను చూసినపుడు అమ్మ నన్ను చాలా చాలా దగ్గర చేసింది. అప్పుడు అమ్మను బ్రహ్మానంద స్థితిలో చూశాను. అమ్మా నీవు బ్రహ్మానంద స్థితిలో ఉన్నావని చెప్పాను కూడా. అదెలా నాన్నా ? అన్నది అమ్మ. ఒక వ్యక్తిని కాని, లేదా వస్తువునుగాని, ప్రేమించిన కొంత ఆనందం వస్తుంది. విశ్వాన్ని ప్రేమించిన నీకు బ్రహ్మానంద స్థితి రాకుండా ఉంటుందా ? అన్నాను. నీవు తెలుసుకొన్నావు నాన్నా! అన్నది. నేను చెప్పింది నా ఊహ. కాని అనుభవ జ్ఞానం కాదు. కాన ఆ స్థితి నాకు తెలియదమ్మా! అన్నాను. తెలిసీ తెలియదని ఒప్పుకొన్న వారికి తెలియ వస్తుంది నాన్నా! - అన్నది అమ్మ. కొన్నేళ్ళ తర్వాత అమ్మ పలికిన ఈ మాటలు తేజోపనిషత్తులో చూశాను.

నేను తెలుసుకొన్న అమ్మతత్త్వం తెలియపరుస్తాను. అమ్మ తాను తల్లిగా భావించి విశ్వమంతా తన బిడ్డలుగా ప్రేమించేది. అది ఆమె సహజ స్థితి. అదే బ్రహ్మానంద స్థితి. బిడ్డలుగా మనం కూడా అమ్మను అనుసరించాలి. అనుసరించి వెళ్ళాలి. అంటే మనం దీనికి కూడా విశ్వప్రేమ సాధించాలి. దీనికి అమ్మ దయ, అమ్మకృప అవసరం. అందుకు అమ్మ నామజపం అవసరం. ప్రతి అమ్మ నామం ఓంకార ద్వయం. అదెలా అంటే అ + ఉ + మ = ఓం, మ + ఉ + అ = మా (AUM + MUA = AMMA) కాబట్టి అమ్మ ఓంకార స్వరూపిణి. ఒక సందర్భములో అమ్మ "అమ్మ"ను మించిన దైవము లేదన్నది. అంటే ఓంకారాన్ని మించిన దైవము లేదన్న మాట. ఆ ఓంకార స్వరూపమే "అమ్మ" అని తెలుసుకొన్నాను.

అలా ప్రబోధిస్తున్న "విశ్వజనని"కి శ్రీ కోన వెంకటేశ్వరరావు సమర్పిస్తున్న 'నీరాజనం' ఈ గ్రంథం.

బెంగుళూరు
30-10-1999

సిరివరం రంగనాథరావు

ముందు మాట

యయా శక్త్యా బ్రహ్మా కమలనయనః ఫాల నయనః
జగత్స్రష్టుం పాతుం, ప్రళయ ముపనేతుం చ కుశలాః
యయా వ్యాప్తం విశ్వం వసతిఖలు యస్యాం జగదిదం
నమామ్యాధ్యాందేవీం ముకుళితకరస్త్వా మభయదాం (శ్రీపన్నాల)

చమత్కార విద్యలు, కళలు ప్రదర్శించే మహాత్ములు, ఏదేశస్థులైనా ఏ జాతి వారైనా వారి నందరినీ మానవజాతి గౌరవిస్తూ ఆదరిస్తూనే వచ్చింది. సామాన్య జనానికి వారు బోధించింది ఏమిటి అనే దానితో ప్రమేయం లేదు. వారి దర్శన భాగ్యంతోనూ, వారి వలన కలిగే ప్రయోజనంతోనూ సంతృప్తులౌతూ, వారే పరమాత్మ అని భావిస్తూ ఉంటారు. భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ మహనీయులను ఆశ్రయించేవారిని ఆర్తులు, అర్థార్థులే, మామిడిపండు తింటాం. ఆనందిస్తాం. కాని ఆ పండును, ఆ పండు కాచిన చెట్టును విశ్లేషించుదామని ఎవరికి ఉంటుంది ?

ఈ అనంతమైన సృష్టిని మహాత్ములు భిన్న భిన్న కోణాలలో చూచి అనుభవించి ఆనందించారు. అందరూ ఒకే కోణంలో నుంచి చూడలేరు. అందరూ అన్ని కోణాల నుంచి చూడలేరు. శంకరులు వీక్షించినట్లు మధ్వ రామానుజులు వీక్షించలేదు. ఎవరి అనుభూతి, ఆనందం వారివి. ఎవరి అనుభూతినీ కాదనటానికి వీలు లేదు. ముందు వారు వెళ్ళిన మార్గంలోనే అందరూ వెళ్ళవలెననే నియమంలేదు. ఈ సృష్టి ఎప్పుడూ తరగనిది. అనంతంగానే వున్నది. ఎవరు ఎట్లా వీక్షిస్తే, అన్వేషిస్తే వారికి అట్లాగే కనబడుతుంది. ఎప్పుడూ ఒక స్థిరమైన భావం కలగనీయదు. అందుకనే ఈ సృష్టిని మాయ అన్నారు. "ఏకం సత్ విప్రాః బహుధా వదంతి" అన్నారు.

చమత్కార విద్యలు, కళలు ప్రదర్శించే వారందరూ తాత్త్విక బోధచేయరు. ఈ విద్యలు కళలూ అన్నీ కూడా అతీంద్రియ జ్ఞానం వైపు మానవ దృష్టిని మళ్ళించడానికి మాత్రమే ఉపయోగపడుతవి. కానీ అదే సర్వస్వమని భావించడానికి వీలులేదు. ఆధ్యాత్మిక శక్తికి దూరశ్రవణ, దర్శనాదులు అత్యల్పాలు అనే నగ్న సత్యాన్ని మనం మరవకూడదు. మహర్షి విశ్వామిత్రుడు అనేక చమత్కారాలు

చేశాడు. బ్రహ్మర్షి అయిన తరువాత అటువంటిది ఏదీ చేయక యథోచిత కార్యక్రమాలను శ్రీరాముని చేత నిర్వర్తింప చేశాడు. తాత్త్వికులందరూ ఈ చమత్కార విద్యను ప్రదర్శించరు. ఆ తాత్త్వికుల ప్రమేయం లేకుండానే వారిని ఆశ్రయించిన వారికి బహుముఖ ప్రయోజనం చేకూరవచ్చు. మాహాత్మ్యాలు ఏవీ కూడా తాత్త్వికుల శక్తి సామర్థ్యాలకు కొలబద్దలు కావు. అటువంటి తత్త్వవేత్తలలో జిల్లెళ్ళమూడి అమ్మగా ఖ్యాతి గడించిన, గుంటూరు జిల్లా, బాపట్ల మండలం, జిల్లెళ్ళమూడి వాస్తవ్యురాలు, ఆ గ్రామాధికారి బ్రహ్మాండం నాగేశ్వరరావుగారి ధర్మపత్ని అనసూయ ఒకరు. ఈమెను 1953 నుంచి 1962 వరకు దర్శించినవారు ఈమెను ఒక సిద్ధురాలు, తపస్విని, యోగిని, జ్ఞానిగా భావించారు. 1962లో కీ॥శే॥ కొండముది రామకృష్ణమూర్తి ఆమె ఆశ్రమ రంగప్రవేశం చేసిన తరువాత ఆమెను ఒక అవతార మూర్తిగా లోకానికి పరిచయం చేశారు. ఆమె ఏనాడూ తాను అవతారమూర్తిని అని చెప్పుకోలేదు. నేనూ మీ లాంటి దానినేనని అన్నది. ఈనాడు షిర్డిబాబాను దత్తావతారం అన్నట్లు ఆమెను పరాశక్తి అవతారంగా వ్యక్తం చేయడం జరిగింది. స్త్రీని శక్తిస్వరూపిణిగా అభివర్ణించడం భారతీయ సంస్కృతి, సంప్రదాయము కూడా. పవిత్రత చేకూర్చుకొన్న స్త్రీలను పూజించడం హైందవ లక్షణం.

అమ్మతో ప్రజలు అనేక రకాల సంభాషణలు చేశారు. కొందరు ఆమెను పరీక్ష చేయడానికి ప్రశ్నిస్తే మరికొందరు జిజ్ఞాసతో చర్చలు జరిపారు. అమ్మ ఎవరికి తగిన రీతిలో వారికి సమాధానం చెప్పింది. ఒకరు అడిగినా, అడగక పోయినా అమ్మ చెప్పదలచుకున్నది లౌక్యంతో మేళవించి చెప్పింది. దర్శనార్థులు అమ్మతో సంభాషణ చేసినప్పుడు నా సోదరి వసుంధరాదేవి రహస్యంగానే ఆ సంభాషణలు తన పుస్తకాలలోనికి తీసుకొని వచ్చింది. అమ్మ దీనిని గమనించినా, గమనించనట్లుగానే కాలం గడిపింది. దరిమిలా కాలంలో బహిరంగంగానే అమ్మ దినచర్యలు, సంభాషణలు పుస్తకాలలోనికి తీసుకొని రావడం జరిగింది. 1964లో బాపట్ల కళాశాల ప్రిన్సిపాల్, భౌతికశాస్త్రవేత్త అయిన డాక్టర్ శ్రీపాదగోపాలకృష్ణ మూర్తిగారు అమ్మ వలన ఒక దివ్యానుభూతి పొంది అమ్మను దర్శించి, సంభాషించి వారి సహజమైన పరిశోధనాతత్త్వంతో ఇతరులతో అమ్మ చేసిన సంభాషణలు తెలుసుకొనుటకు ప్రయత్నించి వసుంధరాదేవి వ్రాసుకొన్న పుస్తకాలు చూచి అమ్మ

నుండి వెలువడిన ప్రతిమాటను గ్రంధస్థం చేయడం తక్షణ కర్తవ్యంగా సూచించారు. అందుకోసం ఆనాడు ఆశ్రమంలో వుంటున్న మన్నవ బాలా త్రిపుర సుందరి, భవానీప్రసాద్‌గా పరిచయం చేయబడిన కుమారి అనే ఆవిడను, కీ॥శే॥ గరుడాద్రి సుబ్రహ్మణ్యం వగైరాలను ప్రత్యేకంగా నియమించారు. కొందరు తాము చేసిన సంభాషణలను పుస్తకాలలో వ్రాసుకొన్నారు. కొందరి సంభాషణలు ఆశ్రమం నిర్వహించిన 'మాతృశ్రీ' మానసపత్రికలోనూ, ఆశ్రమం ప్రచురించిన పుస్తకాలలోను ప్రచురితమైనవి. డాక్టర్ గోపాలకృష్ణమూర్తిగారు స్వయంగా సంకలనం చేసి "అమ్మా – అమ్మ వాక్యాలు", 'అమ్మతో సంభాషణలు' అనే పుస్తకాలు ప్రచురింప చేశారు. కొంత తాత్త్విక బోధ కొండముది రామకృష్ణమూర్తి వ్రాసిన (మహోదధిలో తరంగాలు) అన్న పుస్తకంలో కనబడుతుంది. డాక్టర్ గోపాలకృష్ణమూర్తిగారి అనంతరం అటువంటి మహత్కార్యానికి మరొకరు పూనుకోలేదు. ఆర్తులకు అర్థార్థులకు తాత్త్విక చింతనతో పని ఏమిటి ? జీవన సమరంలో ఆశ్రమం చేరిన వారికి ఆ సంభాషణల మీద లక్ష్యమేముంటుంది ? నియోగింపబడినవారు కాబట్టి తప్పనిసరై మాత్రమే అమ్మ దినచర్యలను సంభాషణలను కొంతవరకు వారి పుస్తకాలలోనికి తీసుకొని వచ్చారు. 1985 జూన్‌లో అమ్మ దేహయాత్ర చాలించింది. 'యద్యదాచరతి శ్రేష్ఠః తత్త దేవేతరో జనః' అన్నది గీతావాక్యం.

నేను అమ్మ జీవితకాలంలో అమ్మ చేసిన సంభాషణలు వినడం మినహా ఏనాడూ అమ్మ చేసిన సంభాషణలు స్వయంగా గ్రంధస్థం చేయలేదు. అమ్మ కనుమరుగైన తరువాత నాలో ఏర్పడిన వెలితిని పూరించుకొనడానికై అమ్మ సంభాషణలు నెమరు వేసుకొంటూ ఆనాటికి ప్రచురితమైన పత్రికలు పుస్తకాలు చదివి నాకు అర్థమైన వాటిని, ఆనందాన్ని, తృప్తిని ఇచ్చిన వాక్యాలను చిత్తు కాగితాల మీద వ్రాసుకొనడం జరిగినది. అద్వైత సిద్ధాంతంలో జగత్తు మిథ్య, అగోచరమైన శక్తి – (బ్రహ్మము) మాత్రము సత్యమన్నారు. అమ్మ ఈ జగత్తూ సత్యమే, పదార్థమూ – శక్తీ అవిభాజ్యమన్నది. కనబడనిది ఏదో కనబడుతున్నది కూడా అదేనన్నది. ఈ జగత్తు పరిణామశీలమైనది. కనబడేది ఉన్నప్పుడే కనబడని దానిని గురించి ఆలోచిస్తావు కనుక కనబడేది కూడా సత్యమే. జగత్తుకు పరిణామము స్వభావం. అందువల్ల అనిత్యంకాదు. ఇలా అమ్మ చేసిన వివరణ


మీద ఎనలేని గౌరవం అభిమానము ఏర్పడినవి. దరిమిలా కాలంలో నేను అప్రయత్నంగానే **'తనుమూలమిదం జగత్' 'సహస్ర సూత్రధారిణి అమ్మ'** అన్న పేరిట రెండు పుస్తకాలను సంకలనం చేసి ప్రచురించటం జరిగింది. తెలుగు వారికి పుస్తక పఠనమనే అలవాటు తక్కువ. అందునా మూల్యం చెల్లించి ఆధ్యాత్మిక పుస్తకాలు కొని చదివేవారు అరుదు. అందుకని నేను ప్రచురించిన పుస్తకాలు అమ్మ సిద్ధాంతవ్యాప్తికై ఉచితంగానే పంపిణి జరపడమైనది. ఆ పుస్తకాలు వెనువెంటనే పునర్ముద్రణ కోరుకొన్నవి. వనరుల కొరతమూలంగా పునర్ముద్రణ చేయలేదు. నేను వ్రాసుకొన్న చిత్తుకాగితాలు కాలగర్భంలో కలిసిపోతుండడంతో వీటిని క్రోడీకరించి వెలువరించి, నలుగురితోనూ నా ఆనందం పంచుకొందామన్న తలంపు కలిగింది. ఈ పుస్తకంలోని విషయం సులభ గ్రాహ్యమైనది కాదు. 'అథాతో బ్రహ్మజిజ్ఞాసా' అని బ్రహ్మసూత్రాలలో చెప్పినట్లుగా కొంత ఆధ్యాత్మిక వేదన, చింతన, ఈ జగత్తును గురించిన జిజ్ఞాస ఏర్పడితే కాని, చదవగా చదవగా గానీ విషయం అర్థం కాదు. ఈ గ్రంథంలో అమ్మ చెప్పని విషయం ఏదీ లేదు. అవసరమైన చోట్ల వాక్య నిర్మాణం మాత్రం నేను చేశాను. ఇది సమగ్రమైన పుస్తకం కాదు. నా వనరులకు లోబడినది. ఇందులోని విషయం ఎక్కడికక్కడ పొడిపొడిగానే వుంటుంది. విషయం పూర్తిగా తెలుసుకోవాలనే వారు ఎక్కడైనా పైన తెలిపిన పుస్తకాలు లభ్యమైతే చదవండి.

నాకు ఈ సంకల్పమును, స్ఫూర్తిని ప్రసాదించి నన్ను తనను మరవనీయకుండా వెంటాడుతున్న తత్త్వవేత్త మాతృమూర్తి అనసూయమ్మకు సభక్తికంగా, సవినయంగా ఈ చిన్న పుస్తకాన్ని సమర్పించుకొంటున్నాను. ఈ పుస్తకాన్ని ఆశీర్వదించమని వేడుకొంటున్నాను.

పాఠకులను ఇందులోని తప్పులను మన్నించి ఒప్పులను మాత్రం స్వీకరించమని, అనాలోచితంగా ఇందులోనికి చొచ్చుకొని వచ్చిన తప్పిదాలను నా దృష్టిలోనికి తీసుకొని వస్తే సరిదిద్దుకోగలని విన్నవిస్తున్నాను.

కోన వెంకటేశ్వరరావు

ఓం **పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే।**
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే॥



జ్ఞానమయి అమ్మ

1. ఒక నూతనమైన ఆలోచన కలిగినప్పుడు అంతకు ముందు ఉన్న ఆలోచన మరుగున పడుతుంది. బాల్యం నుంచి ఇప్పటి వరకు జరిగిన సంగతులన్నీ మనకు గుర్తుండవు. మనస్సుకు హత్తుకున్న కొన్ని సంఘటనలు మాత్రమే గుర్తుంటవి. ఈ ఆలోచనలు క్షణం క్షణం మారుతుంటవి. ఆ మార్పు పెద్దదిగా తోచినప్పుడు మాత్రమే మనం గుర్తించగలం. అనుక్షణం జరుగుతున్న పరిణామాన్ని మనం అర్థం చేసుకోలేం. మార్పుకు లోనుకాకుండా ఉండే వస్తువు లేదు. మార్పు సృష్టి స్వభావం.

2. పరిణామం అనేది సర్వత్రా ఉన్నది. పరిణామం పొందడంలోనూ అర్థం కావడంలోనూ ఆలస్యం కావచ్చు. నా దృష్టిలో జడమే లేదు. ఈ గోడను, రాయిరప్పలను మీరు జడమంటారు. చెట్టుకు చేమకు రాతికి రప్పకు కూడా తరగడం, పెరగడం ఉన్నది. ఉన్న స్థితిలో నుండి మరొక స్థితిలోనికి రావడమే పరిణామం. కొండలకూ పరిణామం ఉన్నది. ఆలోచించే శక్తి రాయికి రప్పకూ ఉన్నదో లేదో, మనిషికి తెలుసా ? అసలు ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి సంభాషణ అవసరం. నా మనస్సులోని అభిప్రాయం నీకు తెలుసా ? నీ మనస్సులోని అభిప్రాయం నాకు తెలుసా ? ఇలా ఉన్నప్పుడు రాయి రప్పలో ఆలోచించే శక్తి ఉన్నదో లేదో, మనకెలా తెలుస్తుంది ? పశువుల తత్త్వం మనది కాదు. కనుకనే మనం అర్థం చేసుకోలేము. క్రిమికీటకాదులకూ సంసారం ఉన్నది. నవ్వూ, ఏడుపూ అన్నీ ఉన్నాయి.

3. సృష్టిలో కలవడం, విడిపోవడమూ – రెండూ ఉన్నాయి. ఇదే గణితం. ఇది అంకెలలో జరగవచ్చు, అక్షరాలలో జరగవచ్చు. గణితంలో ఉన్నది (ఒకటి నుంచి) పది స్థానాలే. ఎన్ని శాస్త్రాలు వ్రాసినా ఉన్న అక్షరాలతోనే

కదా! ఎన్ని మార్చినా ఇంతకంటే లేదు. ఆ పరిధిని అతిక్రమించలేము. మొదటిది భావం. రెండవది భాష. భాషకు అక్షరాలు ఆధారం. అక్షరాలకు శబ్దం ఆధారం. గాలికి కూడా శబ్దాన్నిచ్చే గుణం ఉన్నది. రెండవది చేరితే తప్ప ఒకటిగా ఉంటే ధ్వని లేదు. ఒకటి రెండు కావడమే ఇదంతా. ఉన్నది అదే కనుక. మార్గాలు వేరైనా యథార్థం ఒకటే.

4. పువ్వు విచ్చుతున్నది. పరిణామం అర్థం కావడం లేదు. విచ్చిన తర్వాతనే అవగతమవుతున్నది. తల్లి పెంపకంలో పిల్లవాడు పెరుగుతున్నాడు. అయినా ఏ క్షణంలో ఎంత పెరిగిందీ. ఆ తల్లి చెప్పగలుగుతున్నదా ? అనుక్షణం చూస్తున్నా ఆ పరిణామం అర్థం కాదు. రూపంతో కనిపించిన ప్రతి వస్తువూ పరిణామం పొందకుండా ఉండదు. ఎడారికి రూపం ఉన్నది. రెండు చేతుల మధ్య ఉన్న స్థలానికీ రూపమున్నది. నీవు అంటూ ఉన్నావు కనుక రూపంతోనే కనబడతావు. రూపంలో మార్పు తప్పితే శక్తిలో మార్పులేదని తెలుస్తున్నది. దారానికి కట్టే శక్తి పూవుకు కట్టబడే శక్తి ఉన్నది. ఎట్లా ఉన్నదీ అంటే అనుభవానికి రావడమే. ఆ భావం కలగటానికి సమయమే కారణం. కాలం కంటే గొప్పది ఏమున్నది ?

5. రూపాంతరాలు తప్ప భిన్నత్వం లేదు. అదే పరిణామం. మనస్సుకే భిన్నత్వం. భిన్నత్వం లేని మనస్తత్త్వమే దైవత్వం. దైవత్వం అంటే నాలుగు చేతులూ, కిరీటమూ కాదు.

6. రూపం తేడా. అన్నీ దైవమే. అన్నం రూపాంతరం పొంది అశుద్ధమవుతున్నది. ఒకచోట వదలిన అశుద్ధాన్ని రోజూ వెళ్ళి చూస్తుంటే క్రమంగా దానిలో పురుగులు కనిపిస్తాయి. అక్కడి దాకా ఎందుకు ? కురువులోనూ పురుగులే. అంతా జీవమే.

7. విధి కర్త. విధానం కర్మ.

8. పంచభూతాలను జయించడమంటే వాటిని చూచి భయపడకపోవడమే. ఉన్నదే మనస్సు. వాటిని గుర్తించడమే జయించడం. పంచభూతాలను జయించడం అంటే అవి లేవని కాదు. అవి అర్థం కావడమే జయించడం. మనస్సును జయించాలి అంటారు. మనస్సు లేకుండా మనిషి ఎక్కడున్నాడు ? పంచభూతాల సమ్మేళనమే ప్రాణి.

9. నా దృష్టిలో సృష్టికి నాశం లేదు. సృష్టికి రూపాంతరం తప్ప నాశం లేదు.

10. కాలికి ఉన్న చైతన్యం చెప్పుకు ఉన్న చైతన్యం సమభావంలో ఉన్నప్పుడే కాలికి రాగలుగుతున్నది. తరతమ భేదాలతో చైతన్యం అంతటా ఉన్నది. చెప్పులేసుకున్నంత తేలికగా ఒక కుర్చీని కదిలిస్తే రాకపోవచ్చు. అంటే దానికి చైతన్యం లేదని కాదుగా. ఉపయోగపడనప్పుడు మనకు తెలియదు. కలం వ్రాయనప్పుడు చైతన్యం లేదనుకొంటాం. **చైతన్యం యొక్క లక్షణం పరిణామం.**

11. ఒకే శక్తి అనేకమైంది. సముద్రం చెట్టు కాదు. చెట్టు సముద్రం కాదు. ఆ కట్టుబాటు దానికి ఉన్నది. భవిష్యత్తులో నిర్ణయించిన ప్రకారం జరుగుతుందనుకొంటాం. అనుభవంలో నిర్ణయించినదే జరిగనదను కొంటాం. **వ్యాపారాలు అనేకమైనా సంపాదన అనే ధ్యేయం ఒకటే.**

12. నిప్పు నిప్పే. మంట అంటుకున్న చోట పొగ వస్తుంది. ఇవతల స్వచ్ఛంగా ఉన్నప్పుడు అవతలిది ప్రతిబింబించదు. ఇది బింబ ప్రతిబింబ న్యాయం. **బింబం ప్రతిబింబం కావాలంటే మాలిన్యం కావాలి.** ఒక వస్తువు యొక్క

రూపాంతరమే భిన్నత్వం. భిన్నత్వం ఉన్నప్పుడే పరిణామం. సమష్టి వ్యష్టి కావడమే సృష్టి. మాయ అంటే ఆవరింపబడ్డది. ఉన్నది ఉన్నట్లుగా కనబడనిది.

13. చైతన్యం అంటే స్పందన. ఆ స్పందన చేత కలిగే పరిణామం సృష్టి. అది అనుక్షణం జరుగుతూనే వున్నది. ఆ జరిగేదే విధానం. విధి అంటే బ్రహ్మ. విధే విధానం.

14. దూరదృష్టి కలగడమే అదృష్టం. దూరదృష్టి అంటే దూరాన ఉన్నది కనబడటం కాదు. నేను చిన్నపిల్లగా ఉన్నాననుకో - నాలో ఏదో దైవత్వం ఏదో విశేషం కనబడటమే దూరదృష్టి.

15. జన్మలు ఎందుకు వచ్చినవంటే కర్మ చేతనే అంటున్నారు. కర్మ వాడు చేసుకొన్నదా ? తెచ్చుకొన్నదా ? ఎక్కడిదీ కర్మ ? కర్మ చేయాలనే భావం ఎక్కడ నుండి వస్తున్నది ? ఆలోచనల వల్లనే కదా! కర్మ చేయడానికి వీడు స్వతంత్రుడా ? కర్మ జన్మకు ఆధారమైతే మొదటి జన్మ రావటానికి కర్మ లేదుగా ? మొదట జన్మ వస్తేనే ఆ తర్వాత కర్మ. మొదటి జన్మకైనా ఆధారం ఉండాలి కదా! ఆ మొదటి జన్మకు ఏది ఆధారమో, ఏ జన్మకైనా అదే కారణం కావాలి. కర్మను కూడా సుకర్మ, దుష్కర్మ అని రెండుగా విభజించారు. దుష్కర్మ చేయడానికి 'వీడు' స్వతంత్రుడా ? మంచి పనులు చేయాలని ఆలోచన ఉండి కూడా జరగడం లేదు. ఎందువల్ల ? దుష్కర్మ చేయడానికి కారణం ఏమిటి ? మంచిపనులు చేయాలని ఉండి కూడా చేయలేక పోవడానికి హేతువు ఏమిటి ?

అన్నింటికీ ఆ శక్తే కారణం. ఆ శక్తి చేయించినట్లు చేస్తాం. దానిని బ్రహ్మ అను, విధి అను. ఏ పేరుతోనైనా పిలు. జన్మకు కారణం కర్మ కాదు, శక్తి. మొదటి జన్మకు ఏది కారణమో అన్ని జన్మలకూ అదే కారణం.

ఆ శక్తి జన్మలు ఇస్తే ఉన్నాయి, లేకుంటే లేవు.

కొందరికి కష్టాలు, కొందరికి సుఖాలు ఎందుకున్నాయి - అన్న ప్రశ్న అందరూ వేస్తారు. చెట్టుకు తీగలు అల్లుకున్నాయి. ఆకు అడ్డుతో మచ్చలు ఏర్పడుతున్నాయి. అట్లా అడ్డు రావడానికి శక్తో, దైవమో కారణం కాదు. మనమే కారణం అని కూడా అనుకోవచ్చు. మనం కారణం అనుకొంటే మన ఇష్ట ప్రకారమే అన్నీ చేసుకోవచ్చు. పూర్వ జన్మకు కర్మకు ఏదీ సమాధానం దొరకక సర్వానికీ ఒకే కారణం అనుకొన్నాము. ప్రకృతి ఏర్పడే ఉన్నది. కొత్తగా రావడం కాదు. జన్మలు కావు. జన్మే సముద్రంలోని అల లాంటిది. జీవాలు ఉన్నాయి. జీవుడు ఒక శరీరం వదలి ఇంకొకటి ధరించి రావడం లేదు. శరీరం వదలేటంత వరకే స్మృతి ఉంటుంది. ఆ తర్వాత స్మృతి పోతుంది.

16. పరిమితమైన శరీరంలో ఉన్నదానిని జీవాత్మ అంటున్నారు. శరీరం ఇక్కడే నశిస్తున్నది. శరీరంలోని పరిమితమైన శక్తి అనంతంలో విలీనమవుతున్నది. దీని మీద అనేక సిద్ధాంతాలు వ్యాప్తిలో ఉన్నాయి. కర్మ నుంచి అనేక జన్మలు ఉత్పన్నమవుతున్నవని ఒక సిద్ధాంతం ప్రతిపాదిస్తున్నది. కర్మకు హేతువు ఏమిటి ? తొలుత కర్మ ఎట్లా ఏర్పడినది ? ఈ కర్మకు నివారణోపాయమేమిటి ?

నా దృష్టిలో జన్మలు లేవు. ఆ శక్తే అనేకమైంది. కనుక ఈ హెచ్చు తగ్గులు తరతమ భేదాలు ఏర్పడ్డవి. మంచి చెడ్డలు, హెచ్చుతగ్గులు మనమేర్పరచుకొన్నవి. విధి వర్షం లాంటిది. అది కొందరికి అనుకూలంగాను, కొందరికి ప్రతికూలంగాను వ్యవహరించవచ్చు.

17. జ్ఞాని అయితే పుటక లేదంటున్నారు. దుఃఖ నివారణ అయితే జన్మలేదంటున్నారు. దుఃఖంతో పోయిన వారికి జన్మ ఉందంటున్నారు. జన్మల పరంపర ఒక వలయంగా భావిస్తున్నారు. ఈ గొలుసుకు ఒక

కారణం ఉండాలిగా. ఆ కారణానికి వ్యక్తి బాధ్యుడా ? మంచి పనులు చేద్దామని చేయలేకపోతున్నాడు. చెడ్డపనులు మానుకుందామని మానుకోలేక పోతున్నాడు. ఏదీ వీడి చేతులలో లేనప్పుడు జన్మకు కారణం ఏది ? పూర్వ జన్మ సంస్కారం అంటారు. అయితే మొదటి జన్మకు కారణం ఏమిటి ? ఈ కర్మ సిద్ధాంత రీత్యా ఎప్పుడూ చివర అనేదే లేదు గదా! దీనికి మొదలు చివర లేదు గదా! జ్ఞానికి జన్మ లేదని, అజ్ఞానికి జన్మ ఉన్నదని, సుకర్మ దుష్కర్మ చేసిన వారికి జన్మ ఉందంటున్నారు. శరీరం రావటమే అజ్ఞానమంటున్నారు. శరీరం నశిస్తే అజ్ఞానం అంతమైనట్లేనా ? జ్ఞానానికి అజ్ఞానానికి ఆ శక్తే కారణం.

18. శక్తే ఆత్మ అనుకొంటున్నాను. ఈ స్వరూపాలన్నీ దానివేననుకొంటున్నాను.

19. ఈ జన్మలోనే ఎదురుగా ఉన్నది అర్థం కావడం లేదు. ఇంకొక జన్మ దాకా ఎందుకు ? పోనీ జన్మలు ఉన్నాయి అనుకొందాము. జన్మలు ఉంటే పాపం చేయకుండా మానుకొంటాడా ? మంచి పనులే చేస్తాడా ? జన్మలు లేవంటే నిర్భయంగా పాపం చేయగలడా ? నీకు పాపం లేదంటాను. ఏది జరిగినా బాధ్యత నాది అంటాను. ఒక కత్తి ఇచ్చి పదిమందినీ చంపి రమ్మంటాను. చంపగలడా ?

ఏదీ నీవు చేయలేనప్పుడు ఏదో శక్తి నిన్ను నడుపుతున్నప్పుడు, పాప పుణ్యాల గురించి, జన్మల గురించి ఎందుకు ఆలోచన ?

20. శరీరం కనబడుతున్నది. రెండుగా ఉన్నది కనుక వ్యక్తిత్వం కనబడుతున్నది. ఈ రెండూ ఏదో అతీతమైన శక్తి చేత ఏర్పరచబడ్డవి. ఆ శక్తి ఏదో అర్థం కావడం లేదు. కంటికి కనబడడం లేదు. మనసంటూ ఒకటున్నది. మనసుకు ఆలోచన వస్తున్నా అవునన్నదీ, కాదన్నదీ అదే. కాసేపు ఇదంతా

అంటుంది. ఆ స్థితి వచ్చినప్పుడు మౌనంలో కూడా ఆలోచనలు ఉన్నై. కాసేపు మాట్లాడకుండా కూర్చొనవచ్చు. కానీ మనస్సు ఆలోచన చేస్తూనే ఉంటుంది. మనస్సు ఆలోచన చేస్తున్నదని గుర్తిస్తున్నదీ అదే. ఆలోచన ఉన్నంత వరకూ మౌనం లేదు. మీ అభిప్రాయం మాట్లాడక పోవడమే మౌనం అని. 'అది' 'అది' అనుకొంటున్నాం. అదేదో ఈ కనబడుతున్నదీ అదే. 'సంకల్పరహితం' అనే మాట నిలిచిందే కాని సంకల్పం లేని స్థితి లేదు.

21. నిలకడ లేక పోవడమే మనస్సు స్వభావం. అందుకేగా ఏదో పొందాలనే ఆలోచనలు, సాధనకు మార్గాన్వేషణలు జరుగుతున్నాయి.

22. నీ మనస్సు గురువే. నీ మనస్సుకు ఆలోచన రావడం ఒక శక్తి ద్వారా వస్తోంది. కనుక అదీ గురువే.

23. ఇంకొకరు చెప్పినా వినవలసింది నీవే. విన్నదానిని అర్థం చేసుకొనేదీ, ఆచరించేదీ నీవే, నీ మనస్సే. పుస్తకం చదివి అర్థం చేసుకోవాలన్నా నీ మనస్సే. మనస్సు లేకుండా చేసేదేమున్నది ?

24. మన మనస్సే దైవమూ, మన మనస్సే దయ్యమూ. శ్రీవిద్య అంటే బ్రహ్మ విద్య. అంటే తెలుసుకోవాల్సిన విద్య. కొందరు దీన్ని స్త్రీ విద్యగా మార్చారు. భార్యను తల్లిగా చూడమంటారు. వీడి ఆ వాసన (స్త్రీ కాంక్ష) వదలదు. తల్లిగా చూడవలసిన వారిని భార్యగా చూడడం మొదలు పెడతాడు. భార్యను భార్యగా చూడడం చేతనైతే అంతే చాలు. మంత్రం ఎప్పుడూ కష్టాలను జయించడానికే కాని కష్టాలు రాకుండా ఉండటానికి కాదు. మనకు కష్టం ఎవరిచ్చారు ? మొదట మనకు ఈ ఆస్తి ఇచ్చినవాడే

తీసుకొన్నాడు. మానవులిచ్చారా ? ఇస్తే తీసేసే శక్తి వారికుంది. తీసేస్తే ఇచ్చే శక్తి ఉంటుంది. వాడికి రెండూ ఉండాలి. భూమి అక్కడే ఉంటుంది. కాని చేతులు మారుతుంది. ధనమూ అంతే. డబ్బు అంటే భాగ్యం. డబ్బులేక పోవడం దరిద్రం కాదు. డబ్బు ఉన్నా అవసరాలు తీరకపోతే ? ఏది కావలసిన వాడికి అది అందక పోవడం దరిద్రం. అనుకొన్నది జరగటం సంతోషం. తను అనుకున్నది కాకపోవడం దుఃఖం. ధనం చేతిలో ఉన్నదను కొన్నప్పుడు లక్ష్మి అనుకొంటాడు. జారిపోతే దరిద్రదేవత అనుకొంటాడు. మాతృదేవత, భాగ్యదేవత, దరిద్రదేవత, మృత్యుదేవత అన్నీ దేవతలే.

25. భయమే యముడు. మనస్సు కంటే యముడు ఎవరున్నారు ?

26. ఒక సంన్యాసి దారిన పోతున్నాడు. కాషాయం కట్టుకొన్నాడు. నామాలు పెట్టుకున్నాడు. గొప్పవాడు అనుకొంటావు. ఆ తర్వాత అతడు నీ మనస్సుకు నచ్చినట్లు నడుచుకోకపోతే నీ నమ్మకం చెదిరిపోతుంది. ఏ గురువైనా గుర్తించడానికి మనకు వాణ్ణి గుర్తించే తాహతు ఉండాలి. నీ కెదురుగానున్న వస్తువును గుర్తించాలన్నా దాన్ని గుర్తించే తాహతు నీకుంటేనేగా. నీవు వెతకలేవు. నిన్ను వెతుక్కుంటూ వచ్చేవాడు కావాలి. అట్లా అహర్నిశలు నిన్ను వెన్నంటి ఉండేది ఒకటే శక్తి. ఈ వేళ ఒకరి దగ్గరకు పోయి మంత్రోపదేశం పొంది కొన్ని రోజుల తర్వాత అతనిని కాదనుకొని ఇంకొకరి దగ్గరకు పోవడం – మామూలు స్నేహాలు, పరిచయాలు ఎట్లా ఉంటవో ఈ గురువుల సంప్రదాయాలు కూడా అట్లాగే ఉన్నాయి. మంచికీ చెడుకూ సర్వానికీ వాడే ఆధారం. వాడు నడిపించినట్లు నడుస్తాం అనుకొంటే, మనస్సుకు ప్రేరణ నిచ్చి నడిపిస్తున్న శక్తి గురువు. కాదు మన యత్నం ఉన్నదనుకొంటే ఎవరైనా గురువు కనిపిస్తే అట్లా నడుచుకో. అట్లా కాదు శాస్త్రం ఆధారం అంటావా, అవీ మనుషులు వ్రాసినవే. మాటల్లో చెప్పినా అక్షరాలలో వ్రాసినా వాళ్ళ వాళ్ళ అనుభవాలే. అయితే మీరడిగే అక్షరాలూ

బీజాలు ప్రమాదం అవుతాయి అనీ, మంత్రోచ్ఛారణ సరిగా లేకుంటే ఆ మంత్రం ప్రాణం తీస్తుందనుకోవద్దు. ప్రమాదమేమీ ఉండదు. దైవాన్ని పిలవడం చేతకానంత మాత్రాన ఒక అక్షరం తప్పిపోయినంత మాత్రాన – నీ పిల్లవాడు నిన్ను సరిగా పిలవనంత మాత్రాన నీవు కోపగించు కొంటావా ? ఇదీ అంతే ?

ప్రాణాయామం అంటే అవయవాలతో చేస్తున్నావు. కనుక సరిగా చేయకపోతే ఊపిరితిత్తులకు జబ్బు వస్తోంది. అది ఎవరైనా చేతనైన వాళ్ళ దగ్గర ఉండి చేయడం మంచిది. ఆసనాలు అంటే వాటి వల్ల శరీరం ఎట్లాపడితే అట్లా వంగి ఆరోగ్యంగా ఉంటుంది. మనస్సుకు వీటికి పోలిక ఉన్నదనుకోవద్దు. మీరు కర్మేంద్రియాల్ని కట్టి పెట్టినంత మాత్రాన మనస్సు నిలకడ అవుతుందా ? కాకపోతే కాసేపు అవి (కర్మేంద్రియాలు) నిలకడగా ఉండి శరీరం హాయిగా ఉన్నట్లు అనిపించవచ్చు. అంత మాత్రం చేత మనస్సుని నిరోధించినట్లు కాదు. వీటివల్ల శరీరానికి ఆరోగ్యం. శీర్షాసనం వేశామనుకోండి. రక్తమంతా తలకు దిగినప్పుడు కళ్ళు బరువెక్కి కాసేపు హాయిగా ఉండవచ్చు. దండేలు, బస్కీలు ఇవన్నీ కూడా అంతే. అయితే ఇవన్నీ మనస్సును నిలపలేవు.

27. మనస్సు వల్ల బాధలు కలుగుతాయి. మనస్సు వల్ల బాధలు పోతాయి.

28. మనస్సు లేని ఆనందం ఎక్కడ ఉన్నది ? మనస్సు లేని స్థితి లేదు. కళ్ళు ఆర్పకుండా అట్లా చూస్తే మనస్సు లేనట్లుగా అనిపించవచ్చు. అప్పుడూ మనస్సు లేని స్థితి లేదు. నాడి ఆడకుండా ఉండే స్థితి ఉండవచ్చు.

29. చైతన్యం అంటే కదలిక. శరీరం పైన చీమ పాకితే ఆ స్పర్శ యొక్క గుర్తు లేకుండా ఉండటం ఆనందమా ? ఆ స్పర్శ ఉన్నదో లేదో తెలియని స్థితి

ఆనందమా ? మత్తుమందు పుచ్చుకోవటం వలన ఏమీ తెలియదు. అటువంటి స్థితి ఆనందమా ? ఆనందం అనుభవించాను అంటే రెండోది ఉన్నట్లే కదా! నిద్ర కూడా రమ్మన్నప్పుడల్లా రాదు. శక్తి అంటే మనస్సే. కర్మ ఎట్లా ఉన్నదంటే మనస్సు రూపేణా అని చెప్పుతున్నారు. మనస్సు-శక్తి తప్ప రెండోది లేదని నేనంటాను. మనస్సుకు జరిగేవే కాదు, జరగని సంకల్పాలూ వస్తాయి. సంకల్పం యొక్క ఫలితం ఆలోచన. ఒక కోణంలో ఆ రెంటికీ తేడా లేదు. ఆలోచనలు వచ్చిపోతాయి. సంకల్పమూ - ఆలోచన రెండూ వాడే. ఆ శక్తే అని నేనంటాను. మనస్సుకు రెండుగా ఆలోచించే స్వభావం ఉన్నది - జరిగేవి, జరగనివిగాను, ప్రతి ఆలోచన ఫలవంతం కావటం లేదు. కనుక మనస్సుకు అతీతమైన శక్తి ఉన్నదేమో ననిపిస్తుంది. అయినా నాకు రెండుగా తోచడం లేదు. మన సంకల్పం, వాడి దయ ఉండాలి అన్నప్పుడు, రెండూ ఒకటేనని నేనన్నాను. వాడికి గుణాలు లేకపోతే వీడికీ లేవు. దుర్గుణాలు కూడా. భగవంతుడా అంటూ తనలోని దుర్గుణాలను గురించి వాపోతాడు. అప్పుడన్నాను. వాడికి లేని గుణాలు మీకు లేవని. మనస్సు కూడా శరీరంతో ఉండబట్టే మాట్లాడగలుగు తున్నది. శరీరాన్ని వదిలిన మనస్సు - మనస్సు లేని శరీరమూ లేవు. శరీరం వదలిన మనస్సు సర్వవ్యాపకమైన శక్తి అవుతుంది. గాలి వల్ల చెట్లు కదులుతాయి. చెట్ల వల్ల గాలి కదలదు. గాలి స్పర్శ రూపంతో బయలుదేరి ప్రతిరూపాన్ని కదిలిస్తుంది. నీటి కదలిక కూడా గాలి వలననే. గాలి లాగ మనస్సుకు ప్రత్యేక రూపంలేదు.

30. నిద్ర అంటే ఏమిటి ? నిద్ర శరీరానికా, మనస్సుకా ? గాఢ నిద్రలో మనస్సు ఎలా ఉంటుంది. నిద్రపోతున్నాను. నిద్ర పోతున్నానని మనస్సుకు తెలియదు. ఉన్నది గుర్తించేది మెదడు. లేని దానిని గుర్తించేది మనస్సు. పిచ్చి అనేది మనస్సుకా ? మెదడుకా ? ఒకసారి రోగానికి తగినట్లు మందులు స్ఫురిస్తాయి. మరొకసారి అదే జబ్బుకు అలవాటుగా వాడే

మందులైనా, ఎదురుగా ఉన్నా స్ఫురించవు. దీనిని ఏమంటారు ? ఒక దానిని గురించి తెలుసుకోవడమెంతో, మరచిపోవడమూ అంతే. మనస్సుకు తెలుసుకోవడమూ, తెలుసుకోలేక పోవడమూ అనే ద్వంద్వమున్నది. పరిమితంగా ఉన్న ఈ శక్తి సర్వవ్యాపకమైన శక్తిలో కలసి పోయింది. ఆ శక్తి ఎంతగా ఉన్నదంటే గుర్తించలేనంతగా ఉన్నది. శక్తిని రూపంలో తప్ప మరొకరకంగా గుర్తించలేం. శక్తినే చైతన్యం అనుకొంటున్నాము.

నిద్ర ఈ శరీరానికే. నిద్రలో వచ్చే ఆలోచనలు కలల రూపంలో ఉంటాయి. ఈ కలలు మరొకరికి కనబడేవి కావు. గాఢ నిద్రలో కూడా కొన్ని పిలుపుల తర్వాతనైనా జాగ్రదవస్థ పొందుతున్నాడు. నిద్ర కూడా కోరుకున్నప్పుడల్లా రాదు.

31. ఉన్నది మనస్సే. దాని స్థితికి అనేక పేర్లు పెట్టారు.

32. దయ్యాలు కేవలం మనోభావన మాత్రమే. ఊహాజనితమైన కల్పన మాత్రమే. బ్రతుకు తెరువుకై కొందరు ఏర్పరచుకొన్న ఒక మార్గం మాత్రమే.

33. గాఢమైన మనస్సు తన ఇష్టదేవతనో తాను భావించిన దానినో సర్వత్రా చూడగలదు. మనస్సుకు ఎంతైనా శక్తి ఉన్నది. అదే సాక్షాత్కారం. ఇది ఆత్మ అని ప్రత్యేకించి ఒక రూపాన్ని ఊహించుకొని, నిర్ణయించుకొని అది కన్పించినప్పుడు ఆత్మ సాక్షాత్కారం అంటారు. సాక్షాత్కారం అంటే కనబడటం. ఆత్మ ప్రత్యేకించి కనబడటమంటూ లేదని చెప్తున్నాను. ఫలానా రూపం ఆత్మ అనుకొన్నప్పుడు, ఒక రూపంలో ఉన్నదని మీరు అనుకోవడం వలన అది కనిపించినప్పుడు మీరు దానికాపేరు పెట్టుకొన్నారు. మీరు ఏ జ్యోతినో బొమ్మనో అనుకొంటారు. అంతా ఆత్మే కనుక ఒక్కొక్కరు ఒక్కొక్క రూపాన్ని అనుకోవచ్చు.

34. ఆత్మ పుట్టేది, పెరిగేది కంటికి కనిపించేది కాదు, శాశ్వతమైనది, అంతటా వ్యాపించినదన్నారు. ఆత్మను ఏ రూపంలో ఆరాధిస్తే ఆ రూపంలో కనుపించినప్పుడు సాక్షాత్కారమనుకోవచ్చు.

శక్తిగా ఉండి, అన్నిరూపాలుగా ఉండి జరిగే ప్రతి పనిగా ఉండేదే ఆత్మ అంటున్నాను. నేను ప్రత్యేకించి ఒక రూపంలో (ఆత్మ) ఉన్నదనుకోవడం లేదు. అందుకనే ప్రత్యేకించి ఇది అని చెప్పలేకు పోతున్నాను. అన్నీ అదే అంటున్నా – చెప్పలేక అంటే, ఇది కాక ఇంకొకటి ఉన్నదనిపించడంలేదు. ఆత్మ అనే పేరుకు అంతటా ఆవరించిన శక్తి అంటున్నాను. రూపం కూడా అదే అంటున్నాను.

35. ఆలోచనలు లేని మనస్సులేదు. మనస్సు ఆలోచనలు లేకుండా లేదు. ఆలోచనకు ఆలోచనకు మధ్య విరామం చాలా సూక్ష్మంగా ఉంటుంది. సాధన వలన ఈ విరామం ఎక్కువ అవుతుంది. ఈ విరామం ఎక్కువైనకొద్దీ తనను తాను తెలుసుకొంటాడు. మామూలు మనిషి తన ఆలోచనలకు తాను కట్టుబడిపోతాడు. జ్ఞానికి కూడా ఆలోచనలు ఉంటాయి. కాని అవి అతనిని కలవరపరచవు. అన్ని అవస్థలందూ ఒకే స్థితిలో మనస్సు ఉండటం సమాధి. ఆలోచనలు లేని స్థితి ఉన్నదనుకొనటం ఊహ మాత్రమే.

36. నా దృష్టిలో అశక్తత, అసమర్ధత అనేవి లేనేలేవు. ఎవరు ఏంచేసినా ఆ శక్తి చేయిస్తేనే. ఒకరు ఒకపని చేయలేక పోయినారంటే ఆ శక్తి ఆ పని చేయించలేదన్నమాట.

37. నీవేమీ చేయనక్కరలేదు. చేయాలన్నా చేయలేవు. మానాలన్నా మానలేవు. ప్రయత్నం నీది కాదు. దానికి అవసరమైనదేదో నీనుంచి అదే చేయించుకొని

పోతుంది. ఇది ఏ ఒక్కరి విషయమోకాదు. అందరి విషయమూ అంతే. నన్నే అడుగుతారనుకో. (అంతా అదేననే) నీ కే రోజు నుండి ఈ అభిప్రాయం కలిగిందంటే చెప్పలేను. ఏ సమయంలో నీకీ భావం కలిగిందంటే చెప్పలేను. భావం మార్పుతో చేసే ప్రతి పనీ సాధనే. అంతా వాడి శక్తే ననుకోగల్గితే వంటపని చేసినా, పాకీపని చేసినా సాధనే.

38. పాపమున్నదనేది, లేదనేది విశ్వాసంపైన ఆధారపడి ఉన్నది. నేను చేసింది తప్పు అనుకొన్నప్పుడు కదా, పాపమనే భావన ఏర్పడేది. పరిహారం చేసుకొందామనే ఆలోచన ఎప్పుడు కలుగుతుంది ? తప్పు అనుకొన్నప్పుడు కదా! అందుకోసం దేవాలయానికి వెళ్ళి వస్తున్నాడు. పాపమున్నదన్న భయంతో అది పోగొట్టుకొందామనే ఆశతో కానుకలు వేశాననుకోవడం వలన పాపం పోయిందనే తృప్తి పొందిన వాడవుతున్నాడు. అంటే ఒక తప్పుచేసి, కానుకలు వేసి ఆ పాపాన్ని దైవం తోసేశాడు అనుకొని మరోసారి తప్పుచేసి ఇంకాస్త డబ్బువేసి తృప్తి పడతాడు. దైవానికి ఆ పదిరూపాయలు వేయడంవల్ల వాడు చేసిన తప్పును నిజంగా దైవం తీసేస్తాడా ? చేసేవాడి తృప్తే ఇదంతా. ఆ శక్తే ఇదంతా చేయిస్తున్నది. మంచీ, చెడూ అనేకం అయి ఆ శక్తి కూర్చొన్నది. ఆ శక్తికి అంత ప్రభావం ఉండబట్టే మనం మంచిగా ఉందామనుకొన్నా చేతకావడంలేదు. అసాధ్యమైన ఆలోచనలు అసాధ్యమైన పనులు ఎన్నెన్నో ఆ శక్తి చేయిస్తుంది. వద్దనుకున్నది చేస్తున్నాం. కనుకనే మనకు అతీతమైన శక్తి ఇంకొకటి ఉన్నదనే ఆలోచన కలుగుతున్నది. అనుకొన్నదల్లా జరిగితే ఇంకొకటి ఉన్నదన్న ఆలోచన కలుగదు. నీతి, అవినీతులను గురించి మీరు అడగడం, నేను చెప్పడం కాదు. అందరం కలసి ఆలోచించుకొందాం.

39. సాధన చేయాలన్న కోరిక ఉంటే నీ పూర్వపు సాధన చేసుకో. నాకు అభ్యంతరం లేదు. ఫలానిది సాధన అని నేననను. చేసేవారిని వద్దనను.

మీరు ఒక ధ్యేయమో, లక్ష్యమో పెట్టుకొని గుర్తు చేసుకొంటారు. నాదృష్టిలో అది కానిది లేదు.

40. ఇదమిత్థంగా సాధన ఈ రకంగా చేయమని ఎవరో చెప్పారనుకో, అది చెయ్యలేం. ఆ చెప్పిన విధంగా నడచుకోలేం. మనలను నడిపించినట్లు నడుస్తాం కానీ, ఒకరు చెప్పిన రకంగా చేయలేం.

41. అపవిత్రత మనకు కానీ దైవానికి కాదుగా. మనలను పవిత్రం చేసేదే అది. స్నానం చేయడం వలన శరీరం హాయిగా ఉంటుంది. కాబట్టి మంత్రం ఎప్పుడు చేసినా ఫరవాలేదు. మనం, బయటకు వెళ్ళతాం. అనుకోకుండా మంత్రం జ్ఞాపకం వచ్చింది. మలం పోయింది, మంత్రం జ్ఞాపకం వచ్చింది. బయటకు వెళ్ళినప్పుడైనా నోటితో ఉచ్చరించంగానీ, మనస్సులో అదే వస్తున్నదిగా. కనుక ఏ సమయంలోనైనా మంత్రం చేసుకోవచ్చు. ఏ పరిస్థితుల్లోనైనా మంత్రం చేయి. గుర్తువస్తున్నది కనుక చేయి. ఎట్లా ఉన్నా చేసుకోవచ్చు. అది మైలపడదు. మంత్రం మనలను పవిత్రం చేస్తుంది. కానీ దాన్ని మనం మైల పరచలేం. నా దృష్టిలో అన్నివేళలా మంత్రం చేయవచ్చు. మనస్సే ఆహుతి చేస్తే ఇంకా వేరే ఆహుతి ఎందుకు ? అన్నిటికీ మనస్సేగా. (స్త్రీలతో) మనం దూరంగా ఉన్నప్పుడు మనం రోజూ చేసుకొనే మంత్రం కానీ జపంకానీ ఆ మూడురోజులు (బహిష్టు రోజులు) చెయ్యవద్దంటారు. కానీ ఉచ్చరించనంత మాత్రాన మనస్సులో జపించకుండా ఉండటం లేదుగా? ఇక్కడకు దూరంగా ఉన్నప్పుడు అమ్మను చూడకపోయినంత మాత్రాన మనస్సులో అమ్మ రూపం ఉండకుండా ఉంటుందా ? మంత్రం అంటే అక్షరమాలేగా. ఉన్న అక్షరాలలో కొన్ని అక్షరాలు ఏరి, వాక్యాలు రూపొందించి వాటికొక భావన కల్పించి చెవిలో చెప్పేసరికి మంత్రం అయింది. వాడు (గురువు) ఇచ్చినది మాటేగాని నీ మననంతో మంత్రమైంది.

42. ప్రయత్నం అర్థమైనట్లుగా ప్రేరణ అర్థంకాదు. నేను అనే నేను నేనని తెలుసుకొన్న నేను, తెలుసు కోబడే నేను. తెలుసుకోవడానికి ప్రయత్నించే నేను నేనైన నేను.

43. రాళ్ళతో కట్టిస్తేనే దేవాలయంకాదుగా. నీ హృదయంలో నామంతో కట్టుకో. ఆ ఆలయానికి డబ్బు ఖర్చు ఉండదు. ఇతర వ్యాపకాలు లేక నామం హాయిగా చేసుకొంటూ కూర్చొంటే, దైవాన్ని నమ్మి నీవు కృషి చేస్తున్నప్పుడు, ఏ ప్రయోగాలూ ఏమీ చేయవు. చేతబడులు లేనే లేవు.

44. సంకల్పమే మానవత్వం, సంకల్పమే దైవత్వం, సంకల్పం లేకుండా ఉండాలనుకోవడమూ సంకల్పమే.

45. ఏ ఆలోచన వచ్చినా భగవత్స్వరూపమే ననుకో. అప్పుడేవీ నీ జోలికి రావు. నేను విన్నా వినకపోయినా, నీ మొఱే నిన్ను రక్షిస్తుంది.

46. నీవు అనేదైనా, నీవు అనుకునేదైనా నేను అనుకొంటేనే.

47. వీడి ఆటలో ఉన్న మనం, మనదేదో ఉన్నదని బాధపడుతుంటాము. ఆ శక్తి తమాషా ఏమిటంటే శుద్ధంగా ఉంటే తానే అవుతాము. తనకు లేకపోయినా మనకు మలినం పెట్టాలంటే వాడికి కూడా కావలసి వచ్చిందిగా. ఈ కావలసి రావడమంతా వాడి రూపమే. ఆ శక్తి రూపమే. ఒకే శక్తి అదీ వాడు అయింది. మలినాన్ని గురించి చెప్పాలంటే మలినమే ఆధారం. అద్దం మలినంతో చేసింది. మలినమంటే వస్తు రూపాంతరం. ఒక రూపం మరుగున పడి మరొక రూపం రావడం, అద్దాన్ని స్వచ్ఛతకు మారు రూపంగా తీసుకొంటాము. అద్దం కొన్ని పదార్థాల పరిణామంతో

తయారైంది. శుద్ధమైన అద్దంలో ముఖం చూస్తే కనబడదు. ఆ అద్దానికి రంగుపూస్తేకాని ముఖం కనబడదు. ఆత్మకు ప్రతి జగత్తు. అందుకే జగత్తు ఆత్మ కాకపోలేదు.

48. అన్నింటియందూ దైవత్వం చూడటం ఆత్మసాక్షాత్కారం. ఆత్మకు రూపంలేదు. అవినాశి, మారనిది, శాశ్వతమైనది, పరిపూర్ణమైన దంటున్నారు. ఈ ఆత్మను సాక్షాత్కరించుకొనడమెట్లా ? అందుకు సాధకుడు ఒక నామమో, రూపమో, శబ్దమో ఇచ్చి ఆరాధిస్తాడు. ప్రతి రూపమూ తాను ఆరాధించే రూపంగా, శబ్దంగా భావిస్తాడు. దీనిని సాకార ఆరాధన అంటారు. చివరకు ప్రతిక్షణం ప్రతి చోట ఇదే నామాన్ని రూపాన్ని అనుభవిస్తాడు. తాను ఆరాధిస్తున్న నామ రూపాలు సర్వత్రా వ్యాపించి ఉన్నట్లు భావిస్తాడు. అనుభవిస్తాడు. దీనినే ఆత్మ సాక్షాత్కారమంటారు. మరొక సాధకుడు ఒక జ్యోతిని ఆరాధిస్తాడు. ఎవరూ తాను చూడని దానిని ఆరాధించలేరుగా ? కనుక తనకు అందుబాటులో అనుభవంలో ఉన్న దానిని తన ఆరాధనకు ఎన్నుకొంటాడు. తాను దానికి సన్నిహితుడైన కొద్దీ అతనిలో సన్నిహిత మవుతుంది. అంతటా ఆ జ్యోతినే చూస్తాడు తాను దానిలో లీనమవుతాడు. తాను ఏ రూపాన్నైతే ఎన్నుకొన్నాడో అందులో లీనమవుతాడు. దాని ద్వారా తనను తాను తెలుసుకొంటాడు. అప్పుడు ఇదంతా ఏమిటన్న ప్రశ్న మిగులుతుంది. ఇదంతా వాడే. ఇదంతా దైవమే అని అనుభవంలోకి వస్తుంది. దీనికింత సాధన అవసరం.

49. మనస్సులో ఆలోచనలను, ఊపిరి తీయటాన్ని గమనించటం ఒక సాధన.

50. ఎవరిని చూచినా, ఏది చూచినా అదే అనేబావం ఏర్పడటం కోసమే ఏ సాధనైనా.

51. మంత్రానికి ఆవరణ, అంగన్యాస కరన్యాసాలు చెప్పారు. ఏ మంత్రం చెప్పారో ఆ మంత్రానికి ఆ రూపం ఇచ్చారు. చెప్పుకోవడానికి వేరు వేరు కానీ అనుభవానికి అన్నీ ఒకటే. వచ్చేటంత వరకు అక్షరం దిద్దుకోవలసిందే. అక్షరం ద్వారా ఇంకొకటి గుర్తించాలి కనుక అక్షరం అవసరమైంది. అక్షరాలలో ఎక్కువ తక్కువలు లేవు. అన్నీ సమానమే.

52. భావంలోనే మీరు (ఈ బ్రహ్మం) మూలం నుంచి వేరుగా ఉన్నారు. రేపు స్థిరపడేది కూడా ఈ భావం మారడమే. నేను మీ నుంచి వేరుగా ఉన్నాను అని నాకనిపించదు. మీకేదో పొందాలనిపిస్తుంది. నాకు మీరేదో నేనూ అదే అనిపిస్తుంది. నాకేదో పొందాలనిపించదు.

53. తరుణమే ఋణం, తరుణం వస్తేకాని ఋణ భావం పోదు. ఒకరికి ఒకరు ఋణం లేదు. తరుణం వచ్చినప్పుడు ఒకరికి మరొకరు పెట్టుకొంటున్నారు. సమయం వచ్చినప్పుడే అలా జరుగుతుంది. వీడు వాడికి బాకీ. వాడు వీడికి బాకీ. ఇట్లా పరంపరగా సాగిపోతున్నదనుకోండి, మీరనుకొనే జన్మలు ఉన్నవనుకొన్నా, ఎవరు ఎవరికి బాకీ ఉంటారు ? కావాలని తీసికొని ఎగవేసింది బాకీనా లేక నాపై నేను పెట్టుకోవడం బాకీనా ? తనకై తాను పెట్టింది దానమా ? ఏది ధర్మం ? ఏది ఋణం ? దానానికి ఋణానికి తేడా ఏమిటి ? నా అంతటనేను పెట్టుకొన్నది ఋణమే అయితే ఈ దానాలూ ధర్మాలు ఏమి అవుతాయి ? నాకు మరల రావాలనే ఆశ వదిలితే అది దానం.

54. ఇప్పుడు అనుభవంలో లేనిది ఇంకొక రోజున వచ్చినప్పుడు దానిని తరుణం అంటాం. ఏ ఒక్కదానికో తరుణంకాదు. ఏ పనికైనా తరుణమే. తరుణమంటే

సమయము లేక కాలము అని. ఆయా సమయాలలో ఒక పని జరగడమూ - జరగక పోవడమూ తరుణమే.

55. ఏ శక్తి చేత నీవు ఏర్పడ్డావో, నీ జీవితంలో జరిగే పనులు అన్నీకూడా ఆ శక్తిచేత నిర్ణయింపబడ్డవే, నిర్ణయమంటే మార్చటానికి వీలులేనిది. మారబడనిది. అందుచేత, ఎవరు చేసే పనులు వారికి నిర్ణయింపబడ్డవి. జరిగినదంతా నిశ్చయమేననుకోండి. పిల్లవాడిని పెంచాం. వాడు చనిపోయినాడు. నిర్ణయంలో ఇలా ఉన్నది కాబోలు అనుకుంటాం. జరిగినదే ముహూర్తం.

56. సమయం వచ్చినప్పుడు, తప్పించుకోలేక, తప్పనిసరై తప్పు చేస్తాడు మనిషి.

57. భక్తి అంటే మనోవాక్కాయ కర్మలు. వాటికి అతీతమైన స్థితి గోపికల భక్తి. ఆ భక్తే గోపిక. గోపికలలోనూ అనేకరకాల వాళ్ళున్నారు. ఆ గోపికల ఆరాధన ఎట్లా ఉన్నదంటే ఒకామె ముఖాన్ని, ఒకామె పాదాన్ని, ఒకామె హస్తాన్ని, ఒకామె భుజాలను, ఒకామె చెవులను, ఒకామె నేత్రాలను, ఒకామె లలాటాన్ని, ఒకామె లలాటమందలి తిలకాన్ని ఆరాధించారు. రాధ ఉచ్ఛ్వాస నిశ్వాసాలను ఆరాధించింది.

58. నివేదనకు నియమ మేమున్నది ? మనకు ఏది ఉంటే అదే ఆ దేవుడికి సమర్పిస్తాము. దేవుడు పండు అయితే స్వీకరిస్తాను లేకపోతే వద్దు అనలేదుగా ? బంగారం అయితేనే స్వీకరిస్తాను, మట్టి అయితే వద్దు అనలేదుగా. మనకు కలిగిందేదో దానినే సంతోషంగా నివేదన చేస్తాం. నాకు ఉన్నది మట్టి. నాకు ఆ సమయంలో అందింది మట్టే కనుక దానినే నివేదన చేశాను. దేవుడికి ఏది నివేదన చేస్తామో అదే మనకు ప్రసాదం.

అంతవరకే నాకు తెలుసు. ఈ వాసనలు – రుచి ఏమిటో నాకు తెలియవు.

59. నా దృష్టిలో ఆగ్రహానుగ్రహాలు లేవు. కష్టసుఖాలు, శుభాశుభాలూ లేవు. అన్నీ అనుగ్రహం వలననే. ఇవ్వబడిన సర్వమూ అనుగ్రహమే, ఇక మ్రొక్కినవారు, మ్రొక్కనివారు అని భేదమేమున్నది ?

60. నీవు భూమిని పూజించలేవు. అందువల్ల భూమి నుంచి వచ్చిన ఒక దానిని తీసుకొని దానిని పూజిస్తావు. పసుపు భూమిలోంచి వస్తుంది. కాని పసుపుకు రూపం ఇచ్చి గౌరీదేవి అని పిలిచి పూజిస్తావు. అలాగే విగ్రహం చేసిన శిల్పిని పూజించవు. విగ్రహాన్ని పూజిస్తావు. నేను అంటాను సృష్టి అంతా దైవమే అని. కానీ ఈ అనంత సృష్టిని పూజించలేవు. అందువల్ల ఈ సామాన్యంలో నుంచి ఒక నామాన్ని రూపాన్ని విశేషంగా తీసుకొని దానిని పూజించగా అదే సామాన్యము అవుతుంది. ఆ నామమే సర్వత్రా వినబడుతుంది. అదే సర్వత్రా వ్యాపించినట్లు అనుభవమవుతుంది. ఆ రూపమే సర్వత్రా కనబడుతుంది. దీనినే సామాన్యంలో నుంచి విశేషాన్ని తీసి మరల దానిని సామాన్యం చేసుకోవడమంటాను.

61. విగ్రహాన్ని నీవు ఎవరని పూజ చేస్తున్నావు ? ఒక దేవుడనుకొంటున్నావు. పూజ చేస్తున్నావు. నేను ఈ విగ్రహాన్ని దేవుడనుకోవడం లేదు. ఒక లక్ష్యంకోసం పెట్టుకొన్న ఆకారం. ఇది లోహంతో చేసిందే, పాత్ర సామగ్రి అంతా లోహంతో చేసిందే అయినా వాటికి పూజ చేస్తున్నామా ? చేయడంలేదు కదా కనుక ఒక ఆకారాన్ని ఏర్పరచుకున్నాం. దాన్ని లక్ష్యంగా పెట్టుకొని పూజ చేస్తున్నాం. పూజచేయడం దేనికి. ఆమెను పూజచేయడం కోసమే పూజ చేస్తున్నాం.

62. ఏ శక్తి నిన్ను పూజ చేయమని సంకల్పించిందో, అదే శక్తి అన్నిటినీ చేయిస్తుంది. ఈ విగ్రహం యొక్క పీఠానికి పూజ చేయవు. కేవలం దేవత అనుకొంటేనే పూజ చేస్తున్నావు. ఈ దైవానికి కూడా పీఠం ఆధారమైంది. ఈ దైవం వేరు రకంగా చేస్తే హాని చేస్తుందంటారు. అదేం లేదని నేను అంటాను. తల్లి ఎప్పుడూ అపకారం చేయదు. అటువంటి నమ్మకాలు పెట్టుకోవద్దు.

63. ప్రసాదం అనే భావం లేనప్పుడు, ఫలహారశాలలో తినే దానికి, దీనికి తేడా ఏమున్నది. ఆ భావంలోనే తృప్తి. ఫలితం మాత్రం ఒకటే.

64. మంత్రంలో స్వామి ఉన్నాడా ? మంత్రంతో స్వామిని పిలవడమా ? రెండూ వేరు కానప్పుడు మంత్రము అనడమెందుకు ? ఆ మూర్తిని చూస్తూ కూర్చుంటే చాలదా ? మంత్రోచ్ఛారణ దోషం వల్ల జరిగే నష్టమేమిలేదు.

65. కరుణ లేకపోతే మనం లేం. మనం చేసే పనులన్నీ కరుణ వల్లనే. ప్రతి చిన్న పనీ మన చేతులతో చేస్తున్నా మనుకొన్నా మనం ఎట్లా చేసినా వాడి కరుణ వల్లనే. మనకు కనబడకుండా ఆయా తరుణాలలో ఆయా పనులు చేయించడమే కరుణ. కరుణ సముద్రం అల వంటిది. ఆ తరంగానికి తరుణమొచ్చినప్పుడు నీరే తరంగం అవుతుంది. ఎక్కడో ఒకచోట పుట్టి కొండలాగా పెరిగి లయమవుతుంది. ఒక్కొక్క అల ఎక్కడ నుండో వస్తున్నట్లు ఉంటుంది. నీటికి గాలి ఒరిపిడేగా అల అంటే.

66. ఉన్నదానికంటే భిన్నమైన దానిని వింతైనది, విశేషమైనది మహాత్మ్యం అంటారు. సాధారణంగా సిరాతో కలం వ్రాస్తుంది. సిరా లేకుండా నీళ్ళతో కలం వ్రాయడం విశేషం, మహాత్మ్యం . ప్రతి దానికి – దేనికి తగిన శక్తి దానికి ఉన్నది. అర్థం కాని దాన్ని, విడ్డూరంగా ఉన్నదాన్ని మహాత్మ్యం

అంటారు. నిజానికి ఈ కనబడే సృష్టికంటే సుందరమైనదేమున్నది ? ఏదైనా ప్రకృతిలో ఉన్నదే. విభూతి అయినా మరేదైనా ప్రకృతిలో ఉన్నదే. మనిషి కాకుండా మరేదైనా సృష్టించి మాట్లాడిస్తే, వ్రాయిస్తే గొప్ప విషయమే.

కదలిక అంతా వాయువు వలననే. భూకంపం వల్ల మరోవస్తువు బయటకు వస్తుంది. భూమి తిరగడం వాయువు చలనం వలననే. సృష్టిలో లేనిది సృష్టించలేం. ఉన్న యథార్థాన్ని చెప్పడమే. కనబడని వాడు దైవం అని చెప్పడంలో అర్థం కానిది దైవం అని.

67. ఒకటి మహత్తైనదని గుర్తించిన మహత్తు మీలోనే ఉన్నది. పిల్లవాడికి జ్వరం తగ్గుతుందనే కావచ్చు. నమ్మే శక్తి, ఆ నమ్మకం మీలోనే ఉన్నది.

68. నాకే మహిమలూ తెలియవు. మహిమ అంటూ ఉంటే ప్రపంచంలో ఎంత మంది అన్నంలేక అల్లాడిపోతున్నారో. వాళ్ళందరి కడుపులు అన్నం లేకుండానే నింపనా ? (ఆకలి దప్పులు లేకుండా చేయనా ?) ఈ డాబాలు కట్టడానికి ఇంత శ్రమదేనికి ? వెంటనే నిమిషాల మీద చేయనా ? ఈ బాధలన్నీ ఎందుకు ?

69. అవినీతి ఉన్నదని మనం అనుకొంటున్నాం. ఎవరికి వారు అవినీతి ప్రబలి పోతున్నదంటున్నారు. అవినీతి అనేది మనుష్యులలోనే వస్తున్నది. ఆధ్యాత్మిక చింతన లేనివాడూ లేడు. అవినీతి ప్రబలుతున్నది అననివాడూ లేడు. తన వరకు వస్తే మానుకొన్నది లేదు. అవినీతి గురించి అనుకొనే వారు కాక క్రొత్తవారెవరూ చేయడం లేదు. అనుకొనేవాడు మానుకొంటున్నాడా ? ఆధ్యాత్మిక చింతన వలన కూడా మానుకోలేదు. ఎవరికి వారు తోచి మానుకోగల్గితే అదే ఆద్యాత్మిక సాధన.

70. పెద్దవాళ్ళు చిన్న ఆలోచనలు చేస్తున్నారు కాబట్టి చిన్నవాళ్ళు పెద్ద ఆలోచనలు చేస్తున్నారు. పెద్దవారు పెద్దవారుగా వ్యవహరించక పోవడంతో వస్తుంది గొడవ.

71. సర్వత్రా ఉన్నదానిని చూడలేక ఒక గుర్తుతో చెప్పడం.

72. శబ్దమే ఆత్మ శబ్దమైనప్పుడు ఒకచోట చదవ వచ్చునని ఒకచోట చదవ కూడదని ఏముంది ?

73. నటన అంటే ఒకటి అనుభవిస్తూ, ఒకటి చూపించడం.

74. మమకారాన్ని చంపుకోమనను. నీ వాళ్ళను చూచినట్లుగా అందరినీ చూడమంటాను. మీ వాళ్ళకోసం దుఃఖించినట్లుగా అందరికోసం దుఃఖించండి.

75. నామీద గల ఈ ప్రేమను అందరిమీద చూపగల్గితే, అందరి గురించి ఈ దుఃఖం పొందగల్గితే, మీకు ఈ బాధ తొలుగుతుంది.

76. ఎవరికివారు వారి సంగతులు మరచిపోయి, వారి సంగతులు వదలిపెట్టి మిగతా వారిని మాత్రమే దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు చేస్తారు. ఎవరికివారు విమర్శించుకోవడం వివేకం. ఇతరులను విమర్శించడం అవివేకం. నేను ఎవరికి ఏది ఇచ్చినా అది దానం అనుకోను. వారి వస్తువే నా దగ్గర ఉన్నది. వారిది వారికి ఇస్తున్నాను అనుకొంటున్నాను. ఇందులో నా వదాన్యతా, ఔదార్యమూ ఏదీ లేదు. అటువంటిది ఏదైనా ఉన్నదనుకొంటే వారి వారి యోగ్యతలు పాత్రతా పాత్రతలు విచారించాలి. వారిది వారికి

ఇవ్వడంలో వారి మంచి చెడ్డల ప్రశ్నలతో పని ఏమున్నది ? ఒకవేళ నేనే ఇస్తున్నాను అనుకొంటే, నాకు వారి అవసరమే గుర్తుకు వస్తుంది కాని వారి అర్హత ప్రసక్తి లేదు.

77. ప్రతిజీవి అనుక్షణం తన జీవితంలో జరుగుతున్న ప్రతి సంఘటన గమనిస్తే అవగాహన చేసుకొంటే వేరే శాస్త్రాలతో పని ఏమున్నది ?

78. కలవరింత కూడా ఏదో ఒక దృశ్యం కనబడితే వారిలో వారు మాట్లాడుకోవడమే. కలవరించే వాడికి అది నిజమే. వాడికి ప్రత్యక్షమే. ఇతరులకు కనబడదు. ఇతరులకు వింతగా ఉంటుంది. ఒకరి కలవరం మరొకరికి వింత.

79. క్రోధం లేకపోతే భయానికి తావు లేదు. క్రోధానికి కోపానికి తేడా ఉన్నది. క్రోధం ఎలాగైనా సాధించాలన్నది. కోపం తాత్కాలికంగా బెదురు పెట్టేది. ద్వేషం విషంతో సమానం. రాగం అమృతంతో సమానం. రాగం అంటే కేవలం కోరికగా చెప్తారు. రాగమంటే ఒకటి కావాలనుకోవడం. అదీ తానూ ఒకటే ననుకోవడం. అందరి పొట్టలోనూ ఆరేసి పాములున్నాయి. అవి బుస్సుమంటూనే ఉంటాయి. అందరూ మానవుని జీవితం నవగ్రహాల మీద ఆధారపడి ఉన్నది అంటే నాకు రెండే గ్రహాలు కనబడుతున్నాయి, రాగమూ, ద్వేషమూ. ఆ రెండూ జీవితానికి ఆధారం. ఆ రెంటికీ నేను ఆధారం. రాగమంటే కావాలనుకోవడం. ఒక విధంగా ద్వేషం కూడా రాగమే. ఉదాహరణకు ద్వేషంతో ఒకరిని చంపాలనుకొంటాడు. చంపడం ద్వేషంతో కూడుకొన్నది. చంపాలనుకోవడం కూడా కోరికేగా. ఆ చంపడం కోసం కత్తిని ప్రేమిస్తాడు. విషాన్ని ప్రేమిస్తాడు. వాటికోసం వెతుకుతాడు. అవి దొరకకపోతే బాధపడతాడు. దుఃఖిస్తాడు. అన్నం తినడు. చంపాలన్న

మనిషి కనబడితే చూడలేడు. చూచి సహించలేడు. వీడికి హింసే ఆరాధన. ఇది చూడలేని వాడికి అది హింస. వాడు ఎవరిని చంపాలనుకొన్నాడో మరొకడు దానిని పోషించాలి అనుకున్నాడు. వాడు దేనిని కావాలనుకొన్నాడో వీడు దానిని ద్వేషిస్తున్నాడు. ఒకప్పుడు దేనిని ద్వేషించాడో, మరొకప్పుడు అది అవసరమైంది. ఒకే పదార్థమే ఒకప్పుడు అమృతమై, మరొక సమయంలో విషమౌతుంది. గుణం కూడా కాలపరిస్థితుల ననుసరించి పరిణామం చెందుతుంది.

సర్పం విషజంతువని ప్రసిద్ధి. కానీ అది అమృత జంతువు కూడాను. దాని పంటిలో నుండి వచ్చింది విషం. గొంతు నుండి వచ్చింది అమృతం. సర్పం వెనుక పంటి నుండి పిండేటప్పుడు తగిలినా ప్రమాదం లేదు. గరళం ఒక తరుణంలో ప్రాణహరణం. మరొక తరుణంలో ప్రాణదాయిని. మనిషిని చంపగలిగిన దానికే విషమని కాదుగా. ఒక్కొక్కటి ఇంకొక దాని ప్రాణం తీస్తున్నది. మనిషి అన్నిటిని చంపగలవాడు. దేనినీ చంపలేని వాడు కూడా. అన్నీ కాలం మీదనే ఆధారపడ్డాయి.

80. ఏది అనుభవిస్తుంటే అది సత్యం. కడుపునొప్పి వచ్చినప్పుడు కడుపునొప్పి అసత్యమంటాడా ? బ్రహ్మ సత్యమైననాడు జగత్తు వేరు కాదుగా ? నిత్యమైన దానిని తెలుసుకోవడమే సత్యం.

81. ఏది ఔను ? ఏది కాదు ? అనే విచారణ ఆధ్యాత్మిక మంటారు. కాని ఇది వేరు అని (నేను) విడదీయలేను.

82. కంటితో రెండుగా చూడక తప్పదు. కానీ మనస్సుకు రెండుగా తోచని స్థితి ఉన్నది. భావమే అద్వైతం. దృష్టిలో లేదు. అరటి పండు మొత్తం అద్వైతం. కండను చర్మాన్ని వేరు చేస్తే ద్వైతం. అద్వైత స్థితి ఉన్నది. కానీ ద్వైతమే

మిగులుతుంది. అనేకాన్ని చూస్తూ ఒకటిగా భావిస్తే వాడిని అద్వైతి అంటున్నాం.

83. నీవు, నేనుగా కనిపిస్తున్నది. కానీ అడిగేదిగా చెప్పేదిగా ఉన్నది అనిపిస్తున్నది. నీవడుగుతున్నావు నేను చెప్పుతున్నాను అనుకోకపోతే విషయం అర్థం కాదు.

84. శంకర, రామానుజ, గౌడపాదులు – అందరూ చెప్పినవి నాకు సరిపోతవి. అంత మాత్రమే కాదు. విజ్ఞానశాస్త్రము సరిపోతుంది. ఉన్నది వివరించేది విజ్ఞానశాస్త్రం. ఏర్పడడానికి ఆధారమైనది ఆధ్యాత్మికం. కళ్ళు రెండైనా చూపు ఒకటే. చెవులు రెండైనా వినేది ఒకటే. విషయాలు ఎన్నైనా గ్రహించే మనస్సు ఒకటే. ఈ స్థితి నాకు ఎప్పుడు ఏ సాధన ద్వారా వచ్చిందంటే చెప్పలేను. ఏం చేస్తే వస్తుందో చెప్పలేను. పాఅపని చేసినా భావం మార్పుతో లభించవచ్చు. భూమిని నరికి వ్యవసాయం చేసినా భావం మార్పుతో పొందవచ్చు. వంట కూడా అద్వైతమే. వంట వండినా జపం చేసినా భావం మాత్రం ప్రధానం. పరమాత్మ స్వరూపం ఎట్లా ఉంటుంది ? నీటిని పాత్రలో పోస్తే ఆ పాత్ర ఆకారం ఆ నీటిది. కాని నీరు ఒకటే. మనస్సు ఏది చూస్తుందో దాని ఆకారం ధరిస్తుంది. పరమాత్మ అనేది శక్తి. ఆ శక్తి అనంత రూపాలే ఈ సృష్టి. వ్రాసినా శక్తే. తర్కించినా శక్తే. తర్జుమా చేసినా శక్తే. తత్త్వవిచారణ చేసినా శక్తే. అంతా ఆ శక్తే. పంచ భూతాల తేడాతో పలురకాల రూపాలు ధరిస్తుంది. శీతోష్ణస్థితి కూడా నీలోనూ, నాలోనూ, భూమిలోనూ తేడా ఉన్నది. అందినది విజ్ఞానం. అందనిది దైవం. భావం మార్పుతో చీట్ల పేక ఆడినా, అదీ సాధనే. ధర్మమే దైవం. చెవులు వినడం, నాసిక వాసన గ్రహించడం, కళ్ళు చూడటం అన్నీ ధర్మాలే. ఇందులో ఒకటి మరొక పని చేయడం లేదు. ఏ వస్తువు

ఏ పని చేయడానికి నియమింపబడ్డదో అది చేయడమే దాని ధర్మం. శరీరంతోనే ధర్మాలన్నీ నియమింపబడ్డాయి. కనబడనిది దైవమంటే ఎట్లా ?

యోగాభ్యాసమో, కళ్ళు మూసుకోవడమో, కుంచించడమో కాక ఈ మూడు లేని సాధన కలదా ? శ్వాసను బిగించి ప్రాణాయామం చేయడమో, జపం చేస్తూ శబ్దాన్ని వినడమో, కళ్ళు మూసుకొని శబ్దాన్ని వినడమో – ఇవేనా సాధనలు ?

మనస్సును మనస్సుతో లయం చేయడమో, రూపంలో లయం చేయడమో, తనలో తానుగా ఉండిపోవడమో ఇవే కదా. అనేకులు ఏకాంతం కావాలనుకొంటారు. నాకు ఒంటరితనం లేదు. నాలో అనేకం ఉన్నాయి. అందరూ ఉన్నారు. చాలా మందిలో ఉన్నా ఒంటరిగా ఉండగలను. ఒంటరిగా ఉండి అనేకులలో ఉన్నట్లు ఉండగలను. ఒంటరిగా ఉండి ప్రపంచాన్నంతా ఆలోచిస్తే అందరితో ఉన్నట్లే. పదిమందిలో ఉన్నా మీరేదో అంటున్నా, నా ఆలోచన నాకు ఉన్నప్పుడు అది ఒంటరితనమే.

అంతఃకరణ నశించడమంటే ఎక్కడికి పోతుంది ? ఆనందం అనుభవించేది ఎవరు ? ఆలోచన లేకుండా ఆనందం లేదు. చైతన్యం అన్నా మనస్సన్నా ఒకటే. భావం మార్పే కాని మనస్సు లేని స్థితి లేదు. మనస్సులోని ఆలోచనా రీతిలో మార్పే ఆత్మస్థాయి. పండితుడంటే చదువుకున్న వాడని కాదు, మనస్సు పండినవాడని. పరిపక్వమైన మనస్సు కలవాడి దర్శనమైతే చాలు. "సమదర్శనమంటే సర్వాన్నీ ఒకటిగా దర్శించడం. పుట్టడమే కర్మ. అనుభవమే శాస్త్రం"... నే చెప్పడంలో పదాలు మారినా చెప్పే తీరు మారినా, భావం ఒకటే.

85. నేను నేననే అనుకొంటాను. మీరైన నేను అనుకొంటాను.

86. నిత్యానిత్య వస్తు విచారణ చేస్తూ పోగా అనిత్యం అన్న దానిని తిరస్కరిస్తూ

పోగా చివరకు అంతా సత్యమేననిపిస్తుంది. అసత్యమని తిరస్కరించింది కూడా సత్యమేననీ దృఢపడుతుంది.

87. కదిలే శక్తి కాలు – కదలని శక్తి చెప్పు.

88. భిన్నత్వం అంటే హెచ్చుతగ్గులే. నా మనసు లేదంటాడు కానీ నేను సరిగా లేననడం లేదు.

89. ఇది కాదు, ఇది కాదు అంటూ అంతా నేను కావాలి.

90. గుణాలు పరమాత్మ కంటే భిన్నమైనవా ? లేక వాడి నుండి వేరు అనా ? వాడికంటే అతీతమైతే వాడికంటే మానవుడే గొప్పవాడు. మానవుడికి ఇవి ఎక్కడ నుండి వచ్చినవి. వీడు సృష్టించుకొన్నాడా ? వీడు సృష్టించుకొంటే వీడి ముందు ఆ పరమాత్మ ఎందుకు ? వీడు అనుకొన్నప్పుడు మంచి నీరు కూడా త్రాగలేడే. గుటక వేయాలన్నప్పుడు గుటక కూడా వేయలేడే.

91. మమకారం దేనికీ అవరోధం కాదు. ఒక చోట ఉండే మమకారమే విస్తృతమై సర్వత్రా వ్యాపిస్తే అదే మాధవత్వమవుతుంది.

92. బ్రహ్మతత్త్వమే బ్రాహ్మణతత్వం.

93. ఎప్పుడూ రక్షణా శిక్షణా ఒకడివే.

94. వస్తువు పురుషుడు. అందులోని శక్తి ప్రకృతి. ఆ రెంటి సంయోగంలో ఉండే సంధికాలం శ్రీవిద్య. అదే అవాఙ్మానసగోచరం.

95. ఆహారం అంటే ఏమిటి ? నేను మంచి నీళ్ళు, గాలీ కూడా ఆహారమే నంటాను. నా దృష్టిలో వ్యవహారం కూడా ఆహారమే. ఆహారం ఎప్పుడూ ఎక్కడికక్కడే ఉన్నది. పుట్టగానే బిడ్డ ఏం తిన్నాడు ? మలమూత్రాదులు విసర్జిస్తున్నాడు. తల్లి గర్భంలో ఇన్నాళ్ళు ఏం తిని పెరిగాడని ?

96. ఏది ఇచ్చినా భగవంతుని కరుణేననుకొన్నప్పుడు ఆ దృఢవిశ్వాసం ఉన్నప్పుడు, మనం అనుకొన్నవి జరగనప్పుడు అది ఎంత తీవ్రమైన విషయమైనా బాధపడటం జరగదు.

97. భ్రమ తాడు, పామూ రెండూ తెలిసిన వాడికే. ఒక తాడు తెలిసినా లేక పామే తెలిసినా భ్రాంతి లేదు. పసిపిల్ల వాడి ఎదుటకు పాము వస్తే పామును పట్టుకొంటాడు. వాడికి భ్రమ ఏది ?

98. భ్రాంతి అంటే మమకారం. భ్రాంతి అంటే ఊహించడం. తాడును చూచి పాము అనుకొన్నారనుకో. అది భ్రమయేగా. భ్రమ అంటే ఊహించడమేగా. తాడు నందు పామును ఆరోపించినట్లుగా జగత్తు సత్యమనుకొంటున్నా మన్నారు. రెంటికీ ఒకదానికొక సంబంధం ఉన్నట్లుగా అవినాభావ సంబంధమంటారు. పైన చెప్పిన రజ్జువును సర్పంగా చూడటం నా భావం. భయపడ్డది నా భావం. దీపం తెచ్చింది నా భావం. కాదనుకొన్నది నా భావం. సర్వమూ నా భావమే. అంటే అంతా అభావము లోనిదే. అభావమే భావానికి ఆధారమైనది. భావాభావ సహితమే ఈ ప్రపంచమంతా. దీనికి రహితం లేదు. అంతా సహితమే. అందుకని అవి, నా, భావసంబంధం – అంటే అవినాభావసంబంధం. అంటే కనబడే వాటిని ఊహించడం. ఊహను బట్టి సంబంధం. ఏదైనా చూచే దాన్ని బట్టి కనబడుతుంది.

99. రూపం లేనిది రూపం వచ్చింది. వచ్చిన రూపం పోయింది. ఉన్నది కనుక లేకపోవడమంటూ వచ్చింది. లేదు కనుక ఈ రూపం అంటూ వచ్చింది. లేని రూపం నిర్గుణం. ఉన్న రూపం సగుణం. అదే నిర్వికారమూ, సాకారమూ. నిర్వికారానికి ఆకారము ఉన్నది. సాకారానికి ఉన్నది. ఉన్నదేదో ఉన్నది. ఈ ఉన్నదే అది. అదే నేను.

100. గుణములన్నా గణితమే. అంతా గణితమే. దీని తర్వాత అది అన్నా గణితమే. ఒకటీ, రెండూ, మూడూ అనే కాదు. ప్రతిదీ గణితమే. కృష్ణుడు ఇవన్నీ సృష్టించుకొని అందులో తానూ ఒకడై ఈ లోకాన్ని నడిపిస్తున్నాడు. అ, ఆ, ఇ, ఈ., ఈ అక్షర క్రమము కూడా గణితమే. సంగీతం, మంత్రం. జ్యోతిషం, వేదాంతం, షట్‌శాస్త్రాలు, అక్షరాలలో వ్రాసినా అంకె వేసినా గుర్తించడం సంఖ్య మీదనే ఆధారపడి ఉన్నది. ఈ సంఖ్యే కృష్ణుడు. సాంఖ్య విచారణ అని గీతలో కృష్ణుడు చెప్పాడు. సాంఖ్య విచారణ అంటే కనబడుతున్న దానిని విచారించడమే. కొన్ని అక్షరాలు కూర్చి, ఒక వాక్యం చేసి, ఒక భావాన్ని ఇచ్చి భాగించేది తారకం. భావం తానయ్యేది అమనస్కం. ఈ మూడింటి స్థితి చెప్పేది, చూచేది, చేసేది – చెప్పేది సాంఖ్యం, చేసేది – తారకం, చూచేది అమనస్కం.

101. ప్రతిదీ ఒకేసారి నిర్ణయమై ఉంటుంది. మారేది అయితే మారటానికి వీలైనదైతే దానిని నిర్ణయమనరు. నిర్ణయమంటే తప్పని సరిగా జరిగేది. నేను అమ్మగా నిర్ణయించుకొన్నాను. అమ్మ అమ్మగా కనుపించకపోయినా, అన్నీ తాను ఏర్పరచుకొన్నవయినా ఆ ఏర్పాటు సక్రమంగా ఏర్పరచుకో వలసిందే. ప్రథమంలో స్పందన ఏర్పడినప్పుడే ఎవరి నడకలు వారికి ఏర్పడ్డాయి. నీటికి తడి ఎట్లా స్వభావమో, ఆ స్పందన అనేక రూపాలై ఉన్నది.

102. మంత్రమంటే ఏమిటి ? అక్షరాలలో శక్తి గల అక్షరాలు అంటూ ఉంటాయా ? అక్షరాలకు శక్తి నివ్వగలిగితే గడ్డిపోచకు కూడా ఇవ్వవచ్చుగా ? మంత్రమంటే మనస్సు. బీజాక్షరమంటే శబ్దం యొక్క స్థాయికే అక్షరాలు. అక్షర క్రమమే పీఠిక.

103. అహం బ్రహ్మోస్మి అంటే - అహం అంటే నేను. నేను బ్రహ్మను. అంటే బ్రహ్మ అయిన నేను, నేను నేనుగా ఉన్న నేను, నీవు-నేనుగా ఉన్న నేను అహంకార బ్రహ్మ. నీవు - నేనుగా ఉన్న నేను అంటే రెండుగా ఉన్న స్థితి అహంకార బ్రహ్మ. ఇక్కడ బ్రహ్మత్వం లేకపోలేదు. నేను నేనుగా ఉన్న స్థితి అహం బ్రహ్మోస్మి.

104. పాత్రలోని నీరు బావిలో పోసినా, చెరువులో పోసినా, కాలవలో పోసినా అంతా నీళ్ళ రూపంగానే ఉంటుంది. వేరు వేరుగా ఉన్న నీళ్ళు ఒక దానిలో పోస్తే ఒకే ఆకారంలో ఎలా ఉంటుందో సత్తా (సత్)లో సత్తా కలిస్తే అట్లాగే ఉంటుంది. అందుకే అర్థం కాక గోచరించదు. 'అవాఙ్మానసగోచరం' అని వాడారు. ఏ వస్తువు ఆ వస్తువులో కలిస్తే వేరు వేరుగా కనబడదు. అట్లాగే సత్తాలో సత్తా కలిస్తే వేరుగా కనబడదు. అందుకే అర్థం కానిది, మనస్సుకు అందేది కాదని అన్నారు. కలసిన తర్వాత కనబడేదేమున్నది ? గోచరించేదేముంది ? నాలుగు పాత్రలలోని నీరు ఒక పాత్రలో పోసినట్లు.

105. జ్ఞానము ఏ జంతువైనా సంపాదించుకోవచ్చు. కుక్కకు కూడా అర్థమైన వాటికి అర్థం అవుతుంది. లేని వాటికి లేదు. మనష్యులలోనైనా అంతే. అందరికీ అర్థమవుతుందా ? భావం చేత భాష పుట్టింది. శబ్దం చేత - ధ్వని చేత అక్షరాలు పుట్టినై. ఎందుకైనా భావం ప్రధానమైంది. భాషకు మూలం భావం. భావం నక్కలోనూ కుక్కలోనూ ఉన్నది. దొంగను చూస్తే

యజమానికి ఎంత భయమో, యజమానిని చూస్తే దొంగకూ అంతే భయం. మనలో ఉన్న అవయవాలన్నీ జంతువులలోనూ ఉన్నాయి. వాటిలోనూ ప్రేమ, వాత్సల్యం, సహనం అన్నీ ఉన్నాయి. అవి మనషులలోనూ కనబడకపోవచ్చు. జంతువులలో లేనివి మానవులలో ఉండవచ్చు. ఒక మనిషిలో ఉన్న గుణం మరొక మనిషిలో ఉండకపోవచ్చు. అందువల్ల మానవ జన్మే ఉత్తమ జన్మ అని నాకు అనిపించదు.

106. వ్యక్తి ఉన్న 'నేను'ను ప్రత్యగాత్మ అంటాము. సర్వత్రా ఉన్న దానిని పరమాత్మ అంటాము. అనంతం అంటే అంతులేనిది హద్దులు లేనిది. అంతటా ఉండి తన దగ్గర ఉండి అర్థం కానిది, అందుబాటులో లేనిది పరమాత్మ. అంతటా వ్యాపించినది పరమాత్మ. కర్మతో జ్ఞానాన్ని బోధించడం కర్మకాండ లక్ష్యం. కర్మకాండ మనస్సుతో ముడిపెట్టుకొని ఉన్నది. ఆచారం, ఆధ్యాత్మికం, ఆరోగ్యం విడివిడిగా లేవు. నాస్తికత్వంలో ఆస్తికత్వం ఉన్నది. నాస్తికుడు ఏదో అనుకొని అది లేదు అంటున్నాడు. ఆస్తికుడు ఏదో ఒకటి ఉన్నదని అది ఉన్నదంటున్నాడు. అదీ ఇదీ రెండూ భావమే.

దహనక్రియలలో అగ్నిహోత్రుడిని కూడా తీసుకొని వెళ్ళడంలో ప్రయోజనం ఈ శరీరాన్ని భస్మం చేయడానికి. రేపు నీవు కూడా ఇంతేనని తెలుసుకోవడం కోసం. ఈ నోములూ, వ్రతాలూ, యజ్ఞాలూ, యాగాలు, సర్వత్రా ఉన్న దైవాన్ని దర్శించేటందుకే. వాటివల్ల కనిపించే ప్రతి వస్తువును పూజించడం అలవడుతుంది. ఒక్కొక్క వ్రతానికి ఒక్కొక్క అధిదేవతను చెప్పారు. అధిదేవత అంటే అదిష్ఠానమైనది. వ్రతాలూ, నోములూ అన్నీ ఐదవతనానికి ప్రాముఖ్యతనిచ్చాయి. సత్సంతానానికి ఆధారంగా నిలిచాయి. ఆరాధించడానికే రకరకాలుగా చెప్పారు. విద్యకు సరస్వతి అని, శబ్దానికి బ్రహ్మమని, త్రికాలాలకు బ్రహ్మమని సంభావన చేశారు. సంధికాలాన్ని శివతాండవంగా చెప్తారు.

107. గాఢ సుషుప్తిలో మనస్సు నిద్రాణమై ఉంటుంది.

108. జ్ఞానమంటేనే తెలుసుకోవడం. ఏమని తెలుసుకోవడం ? తానూ ఈ సృష్టీ వేరుకాదని తెలుసుకోవడం. తానూ ఈ సృష్టి వేరుకాదని తెలిసిన వాడిని జ్ఞాని అంటున్నాం. ఇట్లా తెలిసిన దానినే జ్ఞానం అంటున్నాం. ఇట్లా తెలిసిన తర్వాత కూడా సాధన చేయాలనిపిస్తే చేస్తాడు. అవసరం లేదనే స్థితి వచ్చేటంతవరకు సాధన చేస్తాడు. రెండుగా తోచనప్పుడు సాధన చేయడమేమున్నది ? ఏ పని చేస్తున్నా అదే అనుకొంటాడు. వ్యర్థమైన పని అంటూ ఏదీ లేదు ఈ సృష్టిలో. అసలు ఆ ధ్యాసే లేని వాడు మానేస్తాడు. ఆ ధ్యాస కలిగినవాడు తృప్తి కలిగే దాకా చేస్తాడు. గురువు దగ్గరకు వెళ్ళి సాధన ప్రారంభిస్తాడు. సాధన చేస్తూ ఉంటాడు. ఏం పొందామా అని ప్రశ్నించుకొంటాడు. పొందేది మానసిక స్థితి. మనస్సులో భావం స్థిరపడడమే. దృఢపడడానికి కాలమే కారణం. భావం మారడమే. పొందిన వాడికి ఏదో పొందాననిపించదు. దాని గుణమే అది. తన కంటే భిన్నంగా లేనప్పుడు ఏం పొందామా అన్న ప్రశ్న ఉదయించదు. దేనికీ తాపత్రయ పడడు. సందేహం లేని స్థితి ఉంటుంది. అట్టి వాడిని చూచి వాడేదో పొందాడని మనము అనుకొంటాం. నిజానికి తృప్తి అనేది రెండు అక్షరాలే, కానీ, సామాన్యమైనది కాదు. తృప్తి కలిగిన తర్వాత సందేహాలు రావు. ఉనికి ఉన్నదా అంటే ఉన్నది. దాని ఉనికి నీవే. మనస్సుకు తోచేదే కానీ మాటలకు అందదు. కనబడుతున్నదంతా నేనే అనుకొన్నప్పుడు స్థిమితం, హాయి ఉంటుంది. ఎదుటివారు కాదు అనిపించదు. అన్నీ తానే అయిన తర్వాత దేనిని చూచి ఆనందపడతాడు. రెండుగానే చూస్తాడు. మనస్సుకు ఒకటిగా అనిపిస్తుంది. అందులో దిగిన వాడికి సందేహ నివృత్తి కానంత వరకు పొందినట్లు కాదు. రెండుగా అనిపించకపోతే అన్నం పెట్టుకోలేను. అన్నీ తెలుస్తున్నాయి. ఏం పొందానో చెప్పడానికి ఆధారాలు లేవు. ఎప్పుడూ

రెండుగానే కనిపిస్తున్నాయి. వ్యవహారం జరుగుతున్నది. ఒకటిగా తోస్తున్నది. కనుకనే తృప్తి కలుగుతున్నది. అట్లా అనిపించడానికి, కనిపించడానికి కాలమే కారణం. పంచదార చిలకను చూస్తే చెఱకు గుర్తువస్తుంది. ఎంత మంచి చొక్కాను చూచినా పత్తే గుర్తు వస్తుంది. అనుభవం కలిగితే రజ్జు సర్పభ్రాంతి తీసివేయనక్కరలేదు. ఇదంతా బ్రహ్మమే అయితే కాదని భ్రమ పడుతున్నారని చెప్పవచ్చు. రెండూ చూచిన వాడికి భ్రమ కలుగుతుంది. ఏ ఒక్కటో చూస్తే భ్రమ లేదు. శాస్త్రాన్ని సరిగా అన్వయించుకొంటే సరిపోతుంది. మనకున్న భ్రమ చేతనే బ్రహ్మను (ఈ జగత్తును) బ్రహ్మ కాదనుకొంటున్నామని చెప్పవచ్చు. బ్రహ్మకు భ్రమకు కూడా ఉనికిలో పోలిక ఉన్నది.

తెలుసుకొన్నవాడి (జ్ఞాని) గురించి మనకు అర్థం కాదు. ఎందుకంటే మనకా స్థితి లేదు. వాడు (జ్ఞాని) ఏ స్థాయిలో చెప్పాడో వీడికి (అజ్ఞానికి) ఆ స్థితి లేదు. **భావాద్వైతమే కానీ క్రియాద్వైతం లేదు.** కుక్కకు మన చేతులలో ఉన్నది పెట్టగలం కానీ కుక్కతో కలిసి మనం తినలేం. క్రియ చేసే వాడికి అద్వైత స్థితి లేదు.

109. మోక్షమనేది చేరవలసిన లోకమని నేననుకోను. అలా ఉన్నదనే అభిప్రాయం నాకసలే లేదు. ముముక్షుత్వమే మోక్షం.

110. నిత్యానిత్య వస్తు విచారణ చేస్తూ పోగా అనిత్యం అన్న దానిని తిరస్కరిస్తూ పోగా చివరకు అంతా సత్యమేననిపిస్తుంది. అసత్యమని తిరస్కరించింది కూడా సత్యమేనని ధృవపడుతుంది.

111. సంతృప్తి ఉన్నా అసంతృప్తి ఉన్నా ఆ శక్తిలో కలవక తప్పదు.

112. భగవంతుడు వేరుగా ఉన్నాడనుకోను. కనబడేదంతా భగవంతుడనే అనుకొంటాను. అంతటా ఉండి అన్ని రూపాలలో ఉన్నాడనుకొంటాను. నేను ఎప్పుడూ భగవంతుడిని పూజ చేయలేదు. చిన్నతనంలోనూ అంతే. అత్తవారింటికి వచ్చిన తర్వాత అంతే. మామూలుగా ఇంటి పనులు చేసే దానిని. అంతే కాని ప్రత్యేకించి పూజలు, ధ్యానము చేయలేదు.

113. (దైవం) కరుణామయుడని నేనను. అదే అనుకొంటాను. దైవాన్ని నామరూప రహితుడని నేనను. నామరూప సహితుడే అన్నీ అయి ఉన్నాడు.

114. మృత్యువు కూడా దేవతే.

115. రూపాంతరాలు తప్ప భిన్నత్వం లేదు. అదే పరిణామం. మనస్సుకే భిన్నత్వం. భిన్నత్వంలేని మనస్తత్వమే దైవత్వం. దైవత్వం అంటే నాలుగు చేతులూ, కిరీటమూ కాదు.

116. అసలు శక్తి ఒక చోట ఉండి మరొక చోట లేకపోతేగా. అంతా ఆ శక్తే చేయించేది. నీతో చేయించినా, నాతో చేయించినా ఏదైనా కానీ అంతా ఆ శక్తి వల్లనే జరుగుతున్నది. ఇందులో ఎవరి గొప్పతనాలు తక్కువతనాలు లేవు.

117. అసలు భగవంతుడు ఉన్నాడా లేడా అన్నది ఆలోచన. అది (భగవంతుడు) స్త్రీయా లేక పురుషుడా ? ఎవరో తెలియదు. వాడు అని పిలుస్తున్నాం. భగవంతుడు ఉన్నా ఉన్న ఆలోచన ఎందుకు వస్తున్నది ? మనకు తెలియకుండానే మన మనస్సుకు ఒక ఆలోచన వస్తున్నది. దాన్ని స్వభావమంటారు. పోనీ ఆ స్వభావమే భగవంతుడను కొందాం. మనకు

తెలియకుండా మనకు ఆలోచన కల్పించడం, ఆ ఆలోచనలు జరగడం, జరగకపోవడం. దీనినే భగవంతుడు అంటున్నాం.

118. మానుకోవాలంటే మానుకోలేనిది, చేయాలంటే చేయనీయనిది నిర్ణయం. అదే దైవం కూడా.

119. తాను కాకుండా ఏమీ లేదనే స్థితి. పరమాత్మ తాను కాకుండా ఇతరము లేనివాడు. అంతా తానైన వాడు పరమాత్మ.

120. దేవుడిని మైలపరచే శక్తి మానవుడికి ఉంటే ఆ దేవుడికి పూజలెందుకు ?

121. దేవుడన్నాను కానీ ఇంతమంది దేవుళ్ళుంటారని నాకు తెలియదు. అదేదో మనకు మించినది, మనకు అర్థంకానిది ఒక శక్తి ఉన్నది.

122. భ్రాంతి లేని వాక్యమే బ్రహ్మ వాక్యం. భ్రాంతి లేని వాడు బ్రహ్మ.

123. రెండుగానే దృష్టికి కనబడుతుంది. రెండూ ఒకటేననే తత్త్వం ఏదైతే ఉన్నదో అదే దైవత్వం. దృష్టికి రెండుగా కనబడక తప్పదు. మనస్సుకు ఒకటిగా తోస్తుంది. శక్తి తప్ప రెండవది లేదనేది నా అభిప్రాయం.

124. జీవితాంతంలో ప్రాణం అంతటా ఉన్న శక్తిలో కలసిపోతుంది. మరణానంతరం 'వాడు' అంటూ ప్రత్యేకించి లేడు. 'వాడు' అనేది శరీరం ఉన్నంత వరకే. శరీరం పోయిన తర్వాత స్ఫురణ ఉండదు. శరీరం పోతున్నప్పుడు ఆ స్ఫురణ ఉంటుంది. ప్రాణం – నీరు ఆవిరి అయిపోయినట్టుగా ఎక్కడికక్కడ ఆగిపోతుంది. జీవం అంటే – రూపంలో

ఉంటే ప్రాణి. పదార్థం లేనప్పుడు శక్తి అర్థం కాదు. గుర్తించడమనేది రూపం ఉన్నప్పుడే. శక్తిని దైవం అంటున్నాం. దైవానికి ఒక పేరంటూ లేదు. ఎవరికి తోచినట్టు వారు పేరు పెట్టుకోవచ్చు. శక్తి చేతనే వస్తువు ఏర్పడ్డది. కాబట్టి వస్తువూ దైవమే.

125. పూలూ, పురుగులూ దైవమే. పూర్వ జన్మ ఉన్నదని చెప్పేటప్పుడు మరణాన్ని గురించి భయపడరాదు. తల్లి కడుపు నుంచి ఏమి ఆలోచిస్తున్నాడు ? శుక్లశోణితాలుగా ఉన్నప్పుడు స్ఫురణ ఉన్నదా ? ఆ రూపంలో నీవు ఏం చేస్తున్నావు ? వీటన్నిటికీ సమాధానం ఉండదు. నిద్రలో ఈ ప్రపంచాన్ని ఎలా మరచావో, ఈ సంధికాలంలో అట్లా మరచాం అంటారు. నిద్రలో ఏం చేస్తామో గుర్తు లేదు. నిద్రలో స్వప్నం ఉన్నది. శరీరం నిద్రాణమై ఉన్నది. నిద్రలో ఇప్పుడు ఉన్న మనస్సు ఇలా ఉండదు. విశ్రమిస్తుంది. తెలిసీ తెలియనట్లు, వినీ విననట్లు ఉంటుంది. అందులో కొన్ని పిలుపుల తర్వాతనైనా మేల్కొనే శక్తి ఉన్నది. నిద్రలో వచ్చిన ఆలోచనలే స్వప్నం అంటున్నాం. స్వప్నం తాను మాత్రమే చూస్తున్నది.

126. ఒకరు గుర్తించినా, గుర్తించకపోయినా నేను అందరినీ పిల్లలుగానే గుర్తిస్తున్నాను. కనుకనే నేను అమ్మను. నాకు పిల్లలు కానిది కనుపించడం లేదు. నా దృష్టిలో అంతా పిల్లలే. తల్లికి ఎప్పుడూ మరపురాదు. తల్లి స్వభావం ఎట్లా ఉంటుందంటే బురద పూసుకొని వచ్చినా ఇంకా ఏదైనా పూసుకొని వచ్చినా సరే అసహ్యించుకోకుండా ఆ బురద కడిగి వాడిని శుభ్రపరచడమే.

127. 'అమ్మా! ఇంతమంది మీకెలా గుర్తుంటారు ?' అని ఆశ్చర్యంగా అపురూపమైన విషయంగా అడుగుతారు. అమ్మను అనుకొని అడిగినప్పుడు బిడ్డలు

గుర్తుండటంలో విశేషమేమున్నది. నిజానికి గుర్తుండకపోవడం విశేషం. తల్లికి బిడ్డలు గుర్తుండరా ? మీ పిల్లలను మీరు మరచిపోగలరా ? నాకు ఎవరు ఏమి కావాలని అడిగింది, వారి స్థితిగతులు, ప్రవర్తన, పరిస్థితులు... అన్నీ గుర్తుంటాయి. గుర్తుండటంతో పాటు మరపు కూడా ఉన్నది. గుర్తుండటం జ్ఞాపకశక్తి వల్ల కాదు. గర్భతీపి వలననే. కనడమంటే ప్రసవించ నక్కరలేదు. ఆ భావం (మాతృత్వం)తో చూడటం. నేను ఎప్పుడూ ఒంటరి దానిని కాదు. నాలో అందరూ ఉన్నారు.

128. స్వార్థం అంటే తన కోసం చేసుకోవడమేగా. ఏదైనా అంతే. పడుకోవడం, తినడం, త్రాగడం, నిద్రపోవడం... అన్నీ తన కోసమే. ఒక పదార్థాన్ని దాచి పెట్టి తానే తిన్నా, లేక నలుగురికి పెట్టినా తన కోసమే. నలుగురికి పెట్టడంలో లభించిన తృప్తి వాడికి ఆనందాన్ని ఇస్తుందిగా. మిమ్ముల నందరిని ఇట్లా దగ్గరకు తీసుకోవడం, పెట్టుకోవడం ఇవన్నీ మీ కోసం కాదు, నా తృప్తి కోసం. భగవంతుడని నీవు ఆరాధిస్తున్నా పూజ చేస్తున్నా, ఏది చేసినా నీ తృప్తి కోసమే.

129. కనబడేదంతా భగవంతుడు కాదనుకొంటే గదా. మీరు అంతా ముగ్గురు నలుగురు పిల్లలకోసం తాపత్రయ పడతారు. నేను మీ అందరికోసం తాపత్రయపడతాను. నాకు ఎప్పుడూ మీ ధ్యాసే. ధ్యాసే ధ్యానం.

130. నా దృష్టిలో ఎవరైనా ఎక్కడికైనా పోవచ్చు. ఎక్కడైనా ఒకటే. ఇక్కడకు రాని వాడు, వచ్చేవాడు ఒకటే. కాని రాని వాడికి వచ్చేవాడు చెప్పే తీరు వేరు కావచ్చు.

135. మీరు కావాలనుకోవడం ఆశ. ఈ పిల్లలందరికీ కావలసినంత పెట్టుకోలేక పోతున్నానన్నది అసంతృప్తి. ప్రపంచంలో ఎవరూ దరిద్రం అనుభవించకూడదు. అందరూ హాయిగా తిని తిరగాలన్నది నా ఆశ. నాకు ఆశ లేకుండా పోయిన రోజున అట్లా జరుగుతుంది. సృష్టి ఆగిన రోజున నా ఆశ పోతుంది.

136. అమ్మా అని పిలుస్తున్నావు. అమ్మను నీవు ఎట్లా పిలిచినా కోపం రాదు. మంచినీళ్ళను నీవు ఏ రకంగా పిలిచినా బిందె వంక చూపిస్తుంది. కాని నన్ను ఇట్లా ఎందుకు అడిగావు అనదు. మనకు నచ్చనిది శిక్షగా కన్పించవచ్చు. శిక్షణ కూడా రక్షణే. అది అప్పుడు తెలియకపోవచ్చు. ఆ తర్వాత తెలుస్తుంది.

137. నాకున్న అన్ని పాళ్ళు నా కంటే ఏ కొంచెమైనా ఎక్కువ ఉంటే గాని నన్ను తెలుసుకోలేదు.

138. ఇక్కడ జరుగుతున్నది అన్నదానం అనుకోవడం లేదు. ఎవడి అన్నం వాడు తిని వెళ్ళుతున్నాడనుకొంటున్నాను. ఇక అన్నం పెట్టడంలో విశేషమేమున్నది ? అమ్మా అని దగ్గరకు వస్తున్నప్పుడు బిడ్డను దగ్గరకు తీయడంలో విశేషమేమున్నది ?

139. నాకు దరిద్రదేవతే కావాలి. నేను బాధలు అనుభవించాలి. అందరికీ సుఖాన్ని ఇవ్వాలి.

140. నేనెప్పుడూ ఒంటరిదానను కాను. నాలో అందరూ ఉన్నారు. ప్రపంచమంతా నా మనస్సులో నెమరు వేసుకొంటున్నాను. అందువల్ల నేనే అన్నీ అయినాను. అందుకే నేను ఒంటరిదానను కాదన్నాను.

141. నాకు అందరికీ తిండి పెట్టాలనే, ఈ ఆవరణలో ఉన్నవారికే కాక ఈ ప్రపంచానికి కంతటికీ కూడూ, గుడ్డా ఇచ్చుకోవాలనిపిస్తుంది. డబ్బు కావాలి. ఆ డబ్బుతో ఈ పని చేయాలి. మీ కోరిక తీరేది. నా కోరిక తీరనిది. నాకు ఆధ్యాత్మికంగా ఏదో ఉన్నది, అది పొందాలనిలేదు. తరించాలని లేదు.

142. నా దృష్టిలో ఎవరికి వారు గానే కనిపిస్తారు. అందరూ ఒకటిగా కనిపించరు. అందరూ ఒకే శక్తి స్వరూపమనిపిస్తుంది. ఒకటిగా అనిపిస్తారు. వేరుగా కనిపిస్తారు.

143. ఏది చెప్పాలన్నా ఒక ఉదాహరణ కావాలి. ఏ వస్తువును చూచినా వాటి మూలం గుర్తుకు వస్తుంది. చూచిన ప్రతి వస్తువుకు మూలం పంచ భూతాలు. ఒకే వస్తువు ఇన్ని రూపాలు ఎట్లా అయిందో ఆ శక్తి ఇన్ని రూపాలు అయినట్లు అనిపిస్తుంది. ఆ భావ కలుగుతుంది. కనుకనే ఆ శక్తి నేనే అనిపిస్తుంది.

144. నీవు ఎక్కడ ఉన్నా 'అదే'. 'అది' కానిది లేదు. ఏదైనా వాదానికి సరిపోతుందా లేదా అనే అభిప్రాయం లేదు. నాకు తోచింది. నా అభిప్రాయం చెప్పాను. ఈ శరీరం వదలక తప్పదు. ఎప్పుడైనా మీకు లోటు ఏమిటి ? నాకేం కలిగిందో నాకు తెలియదు. నాకేదో కలగాలని లేదు. దుఃఖాన్ని జయించాలని లేదు. దుఃఖం వద్దనుకోవడం లేదు. నాకేదీ వద్దనుకోవడం

లేదు. ఏదీ కావాలనుకోవడం లేదు. కొన్ని సందర్భాలలో కావాలనే ఇష్టం ఉండవచ్చు. అంత మాత్రాన కాకపోతే బాధలేదు.

145. మీరు పిల్లలనే ఆలోచన తప్ప, నాకు మరో రకంగా అనుపించదు.

146. పూజించడమంటే మీరు కావాలనుకోవడమే.

147. గ్రంథివిభేదిని అంటే అన్నింటిలోనూ ఉన్నానని. ఇంకోరకంగా మనవాళ్ళు చెప్పేదేమంటే ఇవన్నీ భేదించుకొని వస్తుందని. శ్రీచక్రమంటే శరీరం అనేగా. నీ శరీరం ఇన్ని గ్రంథులతో నిండి ఉన్నది. ఆమెకు రుద్రగ్రంథి, మహాగ్రంథి అని వేరే లేదు. అన్నీ శక్తితో నిండి వున్నాయి. అంతటా నిండి ఉన్న నిన్ను ఇన్ని నామాలతో పిలుస్తున్నామని.

148. మన ఇంట్లో ఎలుకలు ఉంటాయి. వాటికి ఆహారం రోజూ అలవాటుగా పెడుతూ ఉంటే అవి వచ్చి తిని పోతుంటాయి. ఏ జంతువైనా అంతే. పామును దుష్టజంతువుగా, భయంగా చూస్తామని, పాము రూపంగా దైవమని, సుబ్రహ్మణ్యస్వామి అని అంటున్నారు. పక్షులలో గరుత్మంతుడను నేనే అని చెప్పుకున్నాడు. అన్నింటిలోనూ నేనే ఉన్నానని చెప్పడం కోసం ఇదంతానూ. వాడు అన్నిటిలో నేనే ఉన్నాను అని చెప్పుకున్నాడు. మనం చూడలేకపోతున్నాము. సాటి మానవుడినే సమానంగా చూడలేని మనం ప్రత్యేకించి ఒక దుష్టజంతువును సమానంగా చూడగలుగుతామా ? అందుకని అందులో సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని నేను అన్నాడు. తతిమ్మావి కావని కాదు. మనుష్యులలో దుష్టత్వం గలవారు ఎలా ఉన్నారో పాములలో సాధుత్వం కూడా ఉండకూడదా ? అందులో విశేషమేమున్నది ? పుట్ట పెట్టింది పాము కాదు. చెదలు. మనం ఇంకొకరు కట్టుకున్న ఇంట్లో

ఉన్నట్లు. వాస యోగ్యం కనుక పాములు పుట్టలలోనికి వస్తున్నాయి. ఇందులో విశేషమేమున్నది ? ఉన్నదంతా ఒకటే. దాని తత్త్వం అట్లా వున్నది. మనం భయంగా ఉన్నా ప్రేమగా ఉన్నా, దాని స్వభావమదే. దానిని గురించిన ఆలోచన ఏమున్నది.

149. ఆచరించే వాడికి ఏదైనా ఒకటే. ఆచరించలేనివాడే దానిలో ఏముంది. దీనిలో ఏముంది అని వెతుకుతుంటాడు. చివరకు వెదకడంతోనే సరిపోతుంది. ఏదీ ఆచరించలేడు. తోటి ప్రాణిని ప్రేమించమని ఒక బైబుల్ లోనే చెప్పలేదుగా. అన్నింటిలోనూ చెప్పారు. మనస్సులో లేనిది మతం పుచ్చుకొన్నంత మాత్రాన కలుగుతుందా ? మతం పుచ్చుకోనంత మాత్రాన క్రీస్తు చెప్పింది పాటించకూడదని లేదుగా ? అది పాటించడానికి మతమే పుచ్చుకోనక్కరలేదు.

150. సంస్థ అంటే మంచి చెడులు అన్నీ ఉంటాయి. సంస్థ అంటే అన్నీ చేరిందనేగా. సమస్తం అన్నప్పుడు మంచీ-చెడూ అన్నీ. ఇంకా ప్రత్యేకంగా చెడు ఏమున్నది ?

151. నేను ఈ కనబడుతున్నదే వాస్తవమనుకొంటున్నాను. కనబడుతున్నదే మారుతూ ఉండవచ్చు. మారుతూ ఉండేదే కాని మారకుండా ఉండేది లేదు. మారకుండా ఉండేది మారే దానికి ఆధారం కావచ్చు. ఇదంతా అదే. ఈ కనబడేదే మారేదీ-మారుతూ ఉన్నది. రెండూ ఒకటే. వేరు కాదు. ఇది కాకుండా వేరే ఇంకొకటున్నదనుకోను. ఈ దృశ్యం ఏదైతే మనకు కనబడుతున్నదో అదే సత్యం. ఇది కాకుండా వేరే ఇంకొకటున్న దనుకోను. నేను చూడలేదు. నేను చూడకపోవచ్చు. ఇది ఎప్పుడూ కనబడుతూనేవున్నది. నేను సత్యమైన దానిని చూశాను అనుకొనేవాడికి

ఇది అసత్యంగా కనబడదు. ఈ చెట్టు వృద్ధి పొందవచ్చు. రూపాంతరము చెందవచ్చు. ఈ సృష్టి అనాదిగా ఎప్పుడూ ఉన్నది. ఎప్పుడు మొదలైనది అనేది లేదు. ఎప్పుడూ ఉంటుందని నా అభిప్రాయం.

152. యోగాభ్యాసం చేసేవాడూ, ప్రాణాయామం చేసేవాడూ. ఉచ్ఛ్వాస నిశ్వాసాలను బిగించి కూర్చొంటాడు. ఇంద్రియాలను కట్టిపడవేస్తాడు. కానీ ఆలోచనలు ఉంటాయి. ఎరుక కూడా ఆలోచనే. ఆలోచన అంటే ఎక్కడికో పరుగెత్తాలనీ, ఏదో పని చేయాలనేదే కాదు. నేను ఇట్లా కూర్చున్నాను అన్నదీ ఎరుకే. అదీ ఆలోచనే.

153. ఆనందం అనుభవిస్తున్నామంటున్నారే, ఆ ఎరుకే లేకపోతే ఆనందం ఎవరికి. నిర్వికల్ప సమాధిలో ఆనందం పొందుతున్నామంటున్నారు. కనబడేదీ, చూచేదీ ఉంటేనే కదా ఆనందం. తనలోనే ఆనందపడుతున్నాడు. తన ఎరుక లేని ఆనందం ఏమున్నది ? సహజ సమాధిలోనూ ఆనందం ఉన్నది. అన్ని వేళలలో ఏమి జరుగుతున్నా నవ్వుతున్నాడు. కనుక ఆనందం ఉన్నది.

154. కళ్ళు మూసుకొని కూర్చొని ప్రాణవాయువు బిగపట్టుకొని కూర్చొని నిర్వికల్ప సమాధిలో ఆనందం మిగిలి ఉన్నదన్నప్పుడు ఎరుకలేనప్పుడు ఆనందం పొందేదెవరు ? ఆనందం తానై ఉండేదెవరు ? ఆనందం ఎవరికి ?

155. అన్ని స్థితులూ వాడివే అన్న స్థితి – ఎరుక తానైన స్థితి ఒకటే అని నేను చెప్పాను. అన్ని ఎరుకలూ ఆ సత్తావే. అదే ఇదంతా అనే స్థితి ఎప్పుడూ ఉన్నది. ఏ వేళలో ఏమి జరిగినా, సత్తాయే చేయిస్తున్నదనుకొన్నా (సత్తాను

శక్తి అని గానీ బ్రహ్మ అని కానీ అనండి – ఏమన్నా) అన్ని వేళలలో 'అదే' అనిపించేదే సంకల్పరాహిత్యం.

156. నిర్వికల్ప సమాధిలో ఆనందమే తానై ఉన్నాడన్నారు. ఆనందమంటే భావమే. భావరహితమైన ఆనందము లేదు. తాను తానుగా ఉన్నాడనుకొన్నా ఎరుక ఉన్నది. ఎరుక బావమే. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఆగిపోయినవన్నప్పుడు కూడా ఎరుక ఉన్నది. భావమున్నది. శూన్యాన్ని గుర్తించినప్పుడు కూడా భావమున్నది. ఏమీ లేని స్థితి శూన్యమన్నప్పుడు శూన్యంలో కూడా ఎరుక ఉన్నది. నేను శూన్యంలోనికి చూస్తున్నానంటే ఎరుకైనా ఉన్నది కదా. శూన్యంలో శూన్యమై ఉన్నాను అన్నా ఎరుక ఉన్నది. అది కూడా లేని స్థితి లేదు.

157. నిర్వికల్ప సమాధిలో ఏమి పొందుతున్నాడో నాకు తెలియదు, నేను ఆ స్థితిని పొందలేదు. అన్ని సంకల్పాలూ ఆ సంకల్పమే అనుకొన్నాను. కానీ వేరే నిర్వికల్పం పొందలేదు. నీ సంకల్పమే నా సంకల్పం అనుకోవడం ఇరవై నాలుగు గంటలూ అనుకొన్నాను కానీ నిర్వికల్ప స్థితిని పొందలేదు. నీ సంకల్పమే మిగిలింది కానీ నిర్వకల్పం పొందలేదు.

158. ఈ సంకాల్పలు అన్నీ వాడివేనను కోవడం సంకల్పరాహిత్యం. అదే అనుభవం. కానీ నిర్వికల్ప సమాధి అని పేరు పెట్టినవారు దానిని వివరించిన వివరణ నాకు అనుభవం లేదు.

159. మత్తు మందు ఇచ్చినప్పుడు మనసు ఏమి పని చేసిందో ఎరుకలోనికి వచ్చిన తరువాత కూడా గుర్తులేదు. మత్తులో ఉన్నప్పుడు కూడా ఆలోచన ఉన్నది. (అమ్మ తనకు జరిగిన చికిత్సలో వ్యక్తం చేసింది)

160. ఆలోచన వచ్చిన తరువాత ఆలోచన వచ్చినది అని తెలుస్తున్నది. ఆలోచన రాకముందు ఈ ఆలోచన వస్తుందని తెలియదు. అటువంటప్పుడు ఏదో మనకు తెలియనిదీ అతీతమైనదీ ఒకటున్నదనిపిస్తుంది. అది ఏది అనుకొంటే, శక్తి అనండి సత్తా అనండీ, శాశ్వతమైనదనండి, దైవ మనండి, ఏదో మనకు తెలియని అతీతమైన శక్తి ఆలోచన ఇస్తున్నది. మనమనుకొన్నదే జరిగితే, శక్తి అనో సత్తా అనో ఉపయోగించాలిసిన పని లేదు. ఈ శరీరంలోనే భిన్నమైన ఆలోచనలు రావడానికి కారణమెట్లా ఉన్నదో మనలో వచ్చే ఆలోచనలు ఏ స్థానము నుండి బయలుదేరుతున్నవో తెలియక దానికి మెదడు అని పేరు పెట్టుకొన్నాం. ఆ బ్రైన్ (మెదడు) కూడా వీడి స్వాధీనంలో లేదు. ఆలోచన లేని స్థితి ఉన్నదని ఊహిస్తున్నారు. మాట్లాడకపోవచ్చు. కాని ఆలోచన ఉన్నది. నాడీచలనమూ, ఇంద్రియాలను బిగించినంత మాత్రాన ఆలోచన లేకుండా లేదు. ఏ పని చేస్తున్నా, ఏమి మాట్లాడుతున్నా ఆ శక్తే. అదే అని గుర్తించిన స్థితి. ఎరుక తప్ప ఏమీ లేని స్థితి రెండూ ఒకటే. ఎరుకను కాదనడం నాకు ఇష్టం లేదు. ఎరుక తప్ప ఏమీ మిగలదు. సంకల్పం ఏమీ లేదు అనడం నాకు ఇష్టం లేదు. కనుక ఆ స్థితి ఈ స్థితి ఒకటే.

161. సంకల్పం లేని స్థితి ఉన్నదనేది అన్ని సంకల్పాలు అదే అనే స్థితి ఒకటే. అంతా ఆ సత్తాదే అనే స్థితి ఒకటే. అన్ని సంకల్పాలూ ఆ సత్తానే అని గుర్తించడం. వీడి ఆలోచనలేని స్థితి అంతా ఆ సత్తాదే. వీడి ఆలోచన ఏమీ లేదు.

162. ఉన్నది బ్రహ్మే. బ్రహ్మలో బ్రహ్మ కలిస్తే విడిగా వేరే ఎట్లా వస్తాడు ?

163. నేను చూసినదల్లా బ్రహ్మే. కనిపించనిది ఊహ. నేను చూడనిది ఊహ.

164. సముద్రంలో తరంగం పుట్టినది. మళ్ళీ వెనుకకు పోతున్నది. అన్ని నేనులూ అంతే.

165. భగవంతుడే రెండున్నూ. రెండుగా మనకు కనబడుతున్నె. ఒకటికి ఏది కారణమో. రెంటికీ అదే.

166. సాధ్యం కావడానికి, కాకపోవడానికి కాలమే కారణం. ఆత్మ చేతనే మనస్సు ఏర్పడ్డది. దానికి వినాశం లేదు. తెలిసిన వాడికి జన్మలు లేవు. తెలియని వాడికి ఏది ఏమౌతుందో తెలియదు. అసలు జన్మకేది కారణమో అన్ని జన్మలకూ అదే కారణం.

167. అయిష్టత లేనిదే ఇష్ట దైవం.

168. అంతటా ఉన్నదానిలో ఎవరెవరి ఇష్టదైవాన్ని వాళ్ళు చూస్తారు.

169. విగ్రహారాధన అంటే - జెండా ఆకారమే. శిలువా ఆకారమే. ఏమీలేని ప్రత్యేకంగా చెప్పలేని శూన్యమూ ఆకారమే. అసలు ఆకారం ఆకారాన్ని చూస్తుంది. నాకు ఆకారం కావాలనుకొన్నాను. కనుక ఒక ఆకారం ఆధారం చేసుకొంటున్నాను. సాక్షాత్కారం అంటేనే రూపం. నడిపించేది అర్థం చేసుకోలేక ఇంకొక దాన్ని ఆధారం చేసుకొంటున్నాను. ఓపికలేని వాడు కర్రను ఆధారం చేసుకొన్నట్టు విగ్రహారాధనను అంతటా వున్న శక్తికి ప్రతీకగా తీసుకొంటున్నాడు. కర్రను పట్టుకోవలసింది వీడే. ఇంతకూ రూపంలేనిదేమైనా ఉన్నదా ? రూపంతో ఉన్నప్పుడే ప్రాణాన్ని గురించి

ఆలోచించగలుగుతున్నాను. ఒక మనిషి వేలు తెగిచావవచ్చు. ఒకరు కాలు తెగి చావవచ్చు. ప్రాణం ఎక్కడ ఉన్నదంటే ఏమి చెప్తావు. ప్రాణం కనబడదు. కనిపెడుతుంది. రూపం ఎందుకు పెట్టుకోవాలని రూపం అడుగుతున్నది. ఇటువంటి రూపం కలవాడే రూపం చెక్కాడు. నిగ్రహం కోసమే విగ్రహారాధన. ఏమీ లేని చోట మనస్సు నిలవదు. నిప్పు దానంతట అది మండదు. దానికి సమిధలు కావాలి. విగ్రహారాధన కావాలనేది వీడి భావమే. కూడదు అనేది కూడా వీడి భావమే. గుడిలో విగ్రహమైనా రాయే. ప్రహరీ గోడా రాతితో నిర్మితమైనదే. గుడి మెట్లు రాతితో కూడినవే. పాకీ దొడ్డి కూడా రాతితో కట్టబడినదే. ఇవన్నీ రాయే అయినా. ఆ రాతిలో దైవాన్ని చూస్తున్నది వీడి భావమే. దేవుని చేసిందీ ఉన్నాడనుకొన్నదీ లేడనుకొన్నదీ మనిషే. రాతి బొమ్మలు అక్కరలేదంటున్నారు. ఎవరికి మొక్కాలో చెప్పండి. అసలు మొక్కక పోతే నష్టమేమిటి ? అంతటా ఉన్నది ఆ శక్తే కనుక ఏదో రూపం పెట్టుకొని సర్వత్రా దానిని చూడమంటున్నారు. అన్నిటినీ ఒకటిగా చూడగలిగేటందుకే విగ్రహారాధన. కాలవ నిండా నీరున్నా దాహం తీర్చుకోవడానికి రేవు కావాలి.

170. తృప్తి అనేది రెండు అక్షరాలే అయినా, అది సామాన్యమైనది కాదు. తృప్తి కలిగిన తరువాత సందేహాలు రావు. జ్ఞానికి ఉనికి ఉన్నదా అంటే ఉనికి ఉన్నది. మనస్సుకు తోచేదే కానీ మాటలకు కుదరదు. కనబడుతున్నదంతా నేనే అనిపించినప్పుడు స్థిమితమూ, హాయీ ఉంటుంది.

171. (జ్ఞానిని గురించి) తనకంటే భిన్నం లేనప్పుడు ఏం పొందామా అన్న ప్రశ్న ఉదయించదు. దేనికీ తాపత్రయ పడడు. సందేహం లేని స్థితి ఉంటుంది. అట్టివాడిని చూచి వాడేదో పొందాడు అని మనమనుకొంటాం.

172. మంచీ చెడూ వాడే అని చెప్పే అమ్మ ప్రతిపాదన ఇతరులకు సందేహాన్ని కలిగించవచ్చు. చెడు అంటే ఒకటి రెండుగా ఉండటమనేగా. మనం కొన్ని అలవాట్లు పెట్టుకొన్నాని. వాటికి భిన్నంగా నడిచింది చెడు. అంతే కాని రెండు లేవుగా. ఒక పోగుగా ఉన్న దాన్ని మధ్యలో పట్టుకొంటే రెండుగా కనిపిస్తుంది. ఆ రెండూ కలిపి చివరలో ముడి వేస్తే ఒకటిగా కనిపిస్తుంది. ఆ ముడి వేయకపోతే ? అటువంటిదే ఈ రెండుగా కనిపించడం. ఈ రెండూ ఆ ఒక వస్తువనే చెప్పాను.

173. నీవైన నేను (త్వమేవాహం) అంటే నన్ను ఆరాధనగా పెట్టుకొని నాతో కలవడం. నీవైన నేను. అదే జ్ఞానం. నీవైన నేను. ఆ ధ్యానంలో పెట్టుకొన్న మూర్తిని తనలో చూచి అంతటా చూడటం. అంతా నేనుగా కనిపించడం. తెలుసుకొంటున్న నేను నీలో కలవటానికే సాధన చేయటం. ఆ సాధన సిద్ధించింది జ్ఞానం. నేనైన నేను భగవంతుడు.

174. నిన్ను భూమి మీదకు పంపించేటప్పుడే అన్నీ నిర్ణయించి పంపించింది. ప్రత్యేకించి దారి చూపించేదేమున్నది. జపం చేస్తే ఏ తల్లి రక్షిస్తుందో ఆ శక్తే అన్నీ చేయిస్తుంది. అయినప్పుడు ఉన్న దయ కానప్పుడు లేదా ? అయినా కాకపోయినా అన్నీ అమ్మదయే. సర్వం ఒకటే అనుకొన్నప్పుడు ఇబ్బందులు కూడా అమ్మ ఇచ్చినవేగా. ఇబ్బంది అందులోనిది (దయ) కాకపోతుందా. పదిరూపాయలు చేతిలోనికి వచ్చినపుడు అమ్మ ఇచ్చిందను కొన్నప్పుడు తీసేసినప్పుడు అమ్మ దయ కాదా ?

175. తొలే తల్లి. జగత్తుకు తల్లి కాదు. జగత్తే తల్లి. ఆధారమైనది. అంతులేనిది అన్నాను. పూలను మాలగా గుచ్చడానికి దారం ఆధారం. పూలకు కొమ్మ,

కొమ్మకు చెట్టు, చెట్టుకు భూమి ఆధారం. దీనికి అంతు ఏమున్నది. సర్వానికి సర్వమూ ఆధారం. ఎక్కడికక్కడే అన్నింటికి అన్నీ ఆధారం.

176. కాలమే అన్నీ చేయిస్తుంది. నిన్ను ఏ శక్తి రొంపిలోనికి దింపిందో అదే పైకి లాగుతుంది. ఆ సమయం వచ్చేటంత వరకు ఇందులో ఉండక తప్పదు.

177. నేను ఆలోచనే దైవం అంటాను. లేదా శక్తి అంటాను. ప్రయత్నం కనిపిస్తున్నప్పుడు ప్రేరణ అర్థం కాదు. ఎప్పుడు పూర్ణంగా అనిపిస్తుందంటే రెండూ ఉన్నా అది ఒకటిగా తోచినప్పుడు. ఆ భావం ఎప్పుడు కలుగుతుందంటే సమయం వచ్చినప్పుడు. మనకు తెలియకుండా వచ్చే పరిణామాలు అనేకంగా ఉంటాయి.

178. నాకు అకర్మ-కర్మ తప్ప మూడవది కనబడదు. కర్మ కనిపిస్తున్నది. ఈ కర్మకు కారణం అకర్మ అనుకొంటున్నాను. ఒక పని చేయాలి అంటే చేయలేకపోవచ్చు. చేయలేము అనుకొంటే సాధ్యం కావచ్చు. అంటే మనలను ప్రేరేపించేది కనిపించని శక్తి అనేగా. అది అకర్మ. ప్రేరణను మీరు ఏదైనా అనండి, ప్రారబ్ధం అని కానీ భగవంతుడు అని కానీ మరేదైనా సరే. లేకపోతే వీటన్నిటికి కారణం మనమే అనండి. అంతా నేనే చేస్తున్నాను అనికాని లేదా అంతా మనది కాదు. ఏదో ఒక శక్తి చేయిస్తున్నదని కాని అనండి. కొంత మనది కొంత కాదనుకోవడం వల్ల చిక్కు ఏర్పడుతుంది. ఇందులో ఏదో ఒకటి అనుకొంటే ఫరవాలేదు.

179. ఒక విషయంలో శాంతి ఒకప్పుడు తనకు తెలియకుండానే అనుభవించి ఉంటాడు. కనుక దానికి అవరోధం కలిగినప్పుడు అశాంతి అంటే ఏమిటో తెలుస్తుంది.

180. నీలో ఉన్నా ఇప్పుడు నీకు గుర్తింపు కలగనివ్వని ఆ శక్తే దాని సమయం వచ్చినప్పుడు అదే కలిగిస్తుంది.

181. ఒకరు హృదయం దగ్గరనే 'నేను'ను చూపించారంటే ఆ నేను అక్కడే అంత వరకే పరిమితమైనది అన్న అభిప్రాయంతో కాదు. సర్వత్రా ఉన్న దానిని నీవు చూడలేవు కనుక ఒక గుర్తు చెప్పడం. ఈ ఫోటోలు, గుళ్ళు, మంత్రాలు ఇవన్నీ ఎందుకు అవసరమో ఇదీ అందుకే. ఒక లక్ష్యానికి హేతువైంది. అంతేకాని ఆ కనుబొమ్మల మధ్య. ఆ కళ్ళలోనే శక్తి ఉన్నదని కాదు. అదొక గుర్తు. అంతటా దృష్టిని నిలప గల శక్తి ఉంటే ఇవన్నీ అవసరం లేదు. ఒకరు హృదయం దగ్గర దృష్టిని నిలిపారు అంటే - ఒక ఫోటో ఉన్నదనుకో ఆ ఫోటోలో వున్న బొమ్మకు నమస్కారం పెట్టుతున్నాం. ఆ ఫోటో ఫ్రేమ్‌కు, కాగితానికి, అది తయారు చేసిన వాడికి, ఆ ఫోటో పెట్టిన బల్లకు నమస్కారం చేయమంటే చేస్తామా ? పసుపును నీళ్ళతో తడిపి ముద్దగా చేసి బొట్టు పెడితే గౌరిదేవి అని నమస్కారం చేస్తాం. అంతటా చూడలేం కనుక ఒక పరిమిత రూపంలో గుర్తు చెప్పితే లక్ష్యం కుదరటానికి అవకాశం ఉన్నది కనుక వారు హృదయం దగ్గర చూపారు.

182. నమస్కారం చేయించుకొనేవాడికంటే చేసేవాడు గొప్పవాడు. అసలు నమస్కారం అంటే మనకు తెలియకుండానే పాదాలపై చేతులు పడతాయి. కొందరు మనస్సులో నమస్కారం చేసుకోవచ్చు. మనస్సులోని భావాన్ని ఎవరు తీసివేయగలరు ?

183. నీతో నిన్ను జయించాలి. సర్వం నీవే ననుకొన్నా సరే. లేక సర్వం భగవంతుడనుకొన్నా సరే ?

184. ఏది చేసినా, ఏది ఇచ్చినా భగవంతుని కరుణే అన్న దృఢ విశ్వాసమున్నప్పుడు మనం అనుకొన్నవి జరుగనప్పుడు అది ఎంత దీర్ఘమైన విషయమైనా బాధపడటం జరుగదు.

185. మనస్సుకేగా సందేహం. అదే వింటున్నది. కావాలనుకొంటున్నది. మనస్సూ మానవుడూ వేరు కాదు. పరిస్థితులకు లొంగిపోక తప్పదు. నిజానికి పరిస్థితులు బోధించినట్లుగా ఏ గురువూ బోధించలేదు. ఈ మాట్లాడేదంతా దాని స్వభావమే. ఆలోచన దాని స్వభావమైనప్పుడు ఆలోచన రాకుండా ఎట్లా ఉంటుంది. వినేదీ - చూచేదీ అదే. దైవాన్ని వేడుకొనేది భక్తి కుదర్చమనేదీ మనస్సు ద్వారానే కదా.

186. సత్ప్రవర్తన అసత్య ప్రవర్తన అని అనుకొని ఒకప్పుడు లేనిది ఇప్పుడెక్కువైందని అంటున్నారు. ఎప్పుడు ఉన్నది ఈ ఘర్షణ. ఎప్పుడూ ఉంటుంది. నేను మార్చగలిగింది లేదు. ఎవరి చేతులలోనూ ఉన్నదనుకోవడం లేదు. నడిచేది నడిపించేదీ అంతా అదే. అంటే ఆ శక్తేనని నీ అభిప్రాయం. ఇంతకూ సత్యమంటే ఏమిటి ? అసత్యమంటే ఏమిటి ? ఎట్లా ఉంటే సత్యం ? ఏ విధంగా ఉంటే అసత్యం. ఇది సత్యం ఇది అసత్యం అని నేను విచక్షణ చేయలేక పోతున్నాను. ఆకలి, నిద్ర, మూత్రవిసర్జన ఎందుకు ఏర్పడ్డాయో తెలియదు. పుట్టగానే బిడ్డ పాలకు వెతుక్కుంటుంది. కడుపులో నొప్పి వస్తే చెప్పలేకపోయినా బాధను వ్యక్తం చేస్తుంది. శరీర ధర్మాలు వాటంతట అవి ఏర్పడ్డాయి. అట్లాగే అన్నీను. సంఘం కట్టుబాట్లు కొన్ని ఉన్నాయి. చెప్పకుండా తీసుకుంటే దొంగ. వాడి సొమ్ము వాడు తింటే నిజాయితీ.

వాడి సొమ్ము ఇతరులకు పెడితే దాత. దానం పట్టే వాడు ఉంటేనే గదా దానం చేసేవాడు ఉంటాడు. మన ఆలోచనలను బట్టే గదా మంచీ చెడూ అని విచక్షణ చేస్తున్నది. అన్ని క్రియలకూ ఆధారం ఆలోచనే. ఇంతకూ ఆలోచనలు ఎట్లా వస్తున్నె. ఆలోచన వచ్చిన దానిని బట్టి మనిషి నడుస్తున్నాడు. ఆలోచనకూ ఆలోచనకూ మధ్య మనస్సు ఏమి చేస్తున్నదో తెలియదు. ఎవరు ఎవరిని మార్గంలో ఉంచగలరు. మనిషి తనంతట తాను నడుస్తున్నాడని నేను అనుకోవడం లేదు. మనకు అర్థం కాని శక్తి నడిపిస్తున్నదనుకొంటున్నాను. మీరంతా బిడ్డలనిపిస్తున్నది. తల్లిగా ఎంతవరకు నడుస్తున్నానో చెప్పలేను. అందరి ఆకలి దప్పులు తీరుస్తున్నానా, నా నడకలో మీకేదన్నా గొప్పదనం కనబడుతున్నదేమో. ఏదో బోధ చేస్తే మీరంతా బాగుపడతారనుకోవడం లేదు. నా ప్రేమ వల్ల నాకే సుఖం. నాకే బాధ. కానీ ఇతరులకు ఉపయోగమేమున్నది. అందరూ బాగుపడేటంత ప్రేమ నాలో లేకపోవచ్చు. మీరంతా ఈ రకంగా నడుచుకోమని నేను చెప్పలేదు. అసలు నేను ఏదీ అనుకోవడం లేదు. నా జీవితానికి మీ జీవితానికి తేడా తెలియడం లేదు. మీ జీవితం కంటే నా జీవితం భిన్నంగా ఉన్నదనుకోవడం లేదు. మీ అందరి కంటే నేను అతీతంగా ఉన్నానుకోవడం లేదు.

187. దైవాన్ని చూడటం, ఆత్మ సాక్షాత్కారం పొందటం అంటారు. చూడటం అంటే, రూపం పొందడం అంటే ఏమిటి ? అప్పుడూ రూపమున్నది. ఆలోచనే రూపం. అక్షరం రూపమే. ఆకారమూ రూపమే. నిర్వికారమూ రూపమే. వెలుగూ రూపమే. చీకటీ రూపమే. ఆకాశమూ రూపమే. నా దృష్టిలో విగ్రహారాధన చేసే వాడూ చేయని వాడూ ఒకటే. కనబడేదీ రూపమే. కనబడనిదీ రూపమే. కనబడని దానికి రూపం ఎట్లా ఉంటుంది ? ఇట్లా ఉంటుందని చెప్తావు. అదే రూపమనుకొంటాను. తేజస్సు దైవమను

కొన్నప్పుడు చీకటి కాకుండా పోతుందా ? సృష్టి అంటే వ్యష్టిత్వమే. ఆ శక్తి అనేక రూపాలైంది. నీవు అవునన్నా కాదన్నా నీకు నచ్చినా నచ్చకపోయినా సృష్టే దైవం. నా దృష్టిలో మీరూ అదే. దైవమే అన్ని రూపాలుగా ఉన్నదను కొంటాను. దైవం దొంగగా, వైద్యుడిగా, రోగిగా, ఔషధంగా ఉన్నాడు.

చీకటి వెలుతురుకు ఆధారమైంది. సృష్టే దైవం అనుకొన్నప్పుడు ఏది ముందు ఏది వెనుక అనేది ఏమున్నది. మృత్యువంటే భయం లేకపోవడమే. అదే అమృతస్థితి. పుట్టాం కనుక పోతాం. శరీరం లేని మనస్సు కనిపించదు. వాడి చావుని గురించి వాడికి భయం లేని స్థితి అమృతతత్వం యొక్క స్థితి. చెట్టు కొమ్మను పూవు పూసింది. మొగ్గై తర్వాత కాయ అయి చివరకు పండై, ఉపయోగించకపోతే కుళ్ళిందనుకొంటాం. సంఘం కట్టుబాట్లను అతిక్రమించినప్పుడు తప్పు అంటాం. విగ్రహారాధన తప్పని నేనను. అంతా ఆహారమే అయినా పోషించే పదార్థాలను రకరకాలుగా తీసుకోవచ్చు. మీరంతా విగ్రహాలే కదా. ఆ విగ్రహం కూడా మనిషి చేసిందే కదా.

నిరంతర తృప్తితో, బాధపడకుండా, తప్పు చేస్తున్నాననే భావం లేకుండా, మనిషిని చంపగలిగితే మంచిదే. నాకు అందరికీ అన్నం పెట్టుకొందామనిపిస్తున్నది. అందరినీ అటువంటి తృప్తితో చంపగలడా ?

ప్రేమ అంటే కావాలనుకోవడమే.

సృష్టిలో అన్నీ వున్నాయి. ఒకటే అనేకంగా వచ్చింది.

188. మీరు నన్ను ఏది అంటే ఏది కాదంటున్నాను. భగవంతుడన్నది నీవు పెట్టిన పేరు. కానీ ఆ శక్తికి స్త్రీ పురుషభేదం లేదు. భగవంతుడనే కాదు. ఇంకేదైనా పేరు పెట్టు. ఉన్నది ఒకటే. దాన్నే విజ్ఞానం స్వభావ మంటే ఆధ్యాత్మికం దైవం అంటుంది. నిరాకారుడు అంటే "ఆకారాలు" తానైన వాడు. నిర్గుణుడంటే అన్ని గుణాలూ తానైనవాడు.

189. జరుగుతున్నదే క్రమం. క్రమం అంటే ప్రత్యేకించి వేరుగా ఏదీ లేదు. క్రమం అంటే చెట్లూ చేమలు. తెల్లవారడం, ప్రొద్దుకూకడం. ఈ సృష్టి అంతా. ఇవన్నీ క్రమమే కదా. క్రమంగానే జరుగుతున్నాయి. ఒక మనిషిని తుపాకితో కాలిస్తే చస్తాడు. చచ్చినంత మాత్రాన క్రమం లేదా ? ఒకచోట ఉన్న మనిషి ముక్కలవుతున్నాడు. ఒక దాని చేత మరొకటి భిన్నమవడమనేది ఏర్పడే వున్నది. అదే సృష్టి, అదే క్రమ పద్ధతి. పుట్టినవాడు గిట్టడమన్నది క్రమమేగా. ఈ పుట్టిన మనిషి చావకుండా ఉంచేదేమైనా ఉన్నదా అంటే అది లేదు. వాడి సమయం వస్తే వాడు పోతున్నాడు. నేననుకోవడం మన చేతులలో ఏమీ లేదని నా అనుభవరీత్యా నాకు తెలియని శక్తి ఉన్నట్లు తెలుస్తున్నది. ఆటమ్ చేత చంద్రుని ముక్కలు చేయగలిగిన శక్తి ఏదైతే వున్నదో అదే క్రమ పద్ధతిగా నడుస్తున్నదని నా నమ్మకం. మార్పు కూడా క్రమంలోని భాగమే.

190. ఒకటి రెండై అనేక మయింది అనుకోవడానికి ఇదే ఆధారం. ఒక గింజను భూమిలో పాతిపెట్టాం. భూమిలో నీరుంది, అగ్ని ఉంది. వాయువున్నది. ఆ గింజ నాలుగు రోజులు గడచిన తరువాత రెండుగా విభజించబడుతున్నది. అందులో మొలక ఉన్నది. ఆ మొలకే తర్వాత వృక్షమవుతున్నది. ఆ వృక్షం అనేక పనులు చేస్తున్నది. కాయలు కాస్తున్నది. ఈ చెట్టులో ఏ గుణం ఉన్నదో ఆ గింజలోనూ అదే గుణం వచ్చింది. మహావృక్షంలో ఏ శక్తి అయితే ఉన్నదో అంత చిన్నగింజలో కూడా అదే శక్తి ఏర్పడ్డది. అంత పెద్ద చెట్టుకు అన్ని కాయలు కాసిన చెట్టుకు ఒక గింజకు అన్నింటికి సమానమైన శక్తి ఉన్నట్లుగా గుర్తించాను. అదే శక్తి ఇన్ని కాగలిగింది అనుకోవడానికి అదే ఆధారం. మర్రి చెట్టు ఊడలు పై నుంచి క్రిందకు వస్తున్నై. కాయలు కాస్తున్నది. కాయలోని ఒక గింజకు వున్న గుణం ఇంత చెట్టుకూ వున్నది. రూపం వేరుగాని శక్తి అనంతం అనడానికి కారణం

ఇది. ఇట్లా ప్రతి దానిని వివరించుకు వస్తే ఆ చెట్టునూ, కాయను, గింజను గుర్తించింది మనస్సు. భౌతికంగా శక్తే అక్కడా ఇక్కడా. బీజమనేది అర్థం కావడానికి చెప్పాను. కానీ శక్తి అనేక రూపాలలో అనేక రకాలుగా ఉన్నదంటాను. ఒకటిగానే ఉన్నదంటే నీవూ - అతనూ ఉన్నారు. చెట్లను గుర్తించేవాడు వేరుగా ఉన్నాడు. శక్తి వేరుగా ఉన్నది. శక్తే శక్తిని గుర్తిస్తున్నది. ఇక్కడ గుర్తించే శక్తి అక్కడ గుర్తింపబడే శక్తి ఉన్నది. గుర్తింపబడటానికి వీలైన శక్తి కనబడితేనే అక్కడ ఉంటేనే గుర్తించే శక్తి ఇక్కడ ఉన్నది. వైవిధ్యం వచ్చిన తరువాతనే గుర్తు పట్టడానికి వీలైంది. సమానత్వం రావడానికి నీవు వేరుగా ఉండాలి. సమానత్వమైన గుర్తు నీవు గుర్తించలేవు. వైవిధ్యం ఉంటేనే కాని గుర్తించలేవు.

191. ఉనికి - శక్తీ (రూపమూ - శక్తీ) రెండూ అదే. గుర్తింపబడని కాలమంటూ ఒకటున్నదా ? అది ఊహే అవుతుందా ? నిజమవుతుందా ? మట్టిని గుర్తిస్తే పరిశోధనలో తేలింది. కాని బంగారానికి ప్రత్యేకించి ఉనికి లేదు. మట్టిగా ఉన్నది మట్టిలో లేదు. ఆ మట్టిని గురించిన కొంత జ్ఞానం కలిగిన తరువాత ఈ మట్టికి ఈ గుణమున్నదని ఆ మట్టికి ఆ గుణమున్నదని తెలిసింది. అన్నీ మట్టిలో పుట్టినవైనా ఆనాడే ఉన్నా నీవు గుర్తించే కాలమంటూ ఒకటి ఏర్పడింది. ఈ ఏర్పడిన కాలం నుంచి మాట్లాడు కొంటాం. భిన్నత్వం ఉన్నదని నేను గుర్తించినప్పటి నుంచీ మాట్లాడుతున్నాను. నేను శక్తిని. శక్తీ నేనూ ఒకటే కావచ్చు. శక్తి నేనుగా ఉంటున్నాననుకొన్నా నేనుగా మాట్లాడుతున్నాను. శక్తి నానాత్వం లేని స్థితి ఒకటున్నదని లేదని గుర్తించడానికి నానాత్వం ఏర్పడితే గాని గుర్తించలేవు. ఈ నానాత్వం ఏర్పడిన తరువాతనే మాట్లాడుతున్నావుగాని, ఏర్పడక ముందున్న స్థితిని గురించి మాట్లాడటం లేదు. ఆధారం లేనిదే మాట్లాడటం నాకు ఇష్టం లేదు. నేను గుర్తించినంత వరకు నేనూ - తానూ, నేనే అది. అదే నేను

నేనైన నేను అన్న స్ఫురణ ఉన్నది కాని నేనూ అదీ ఒకటైన కాలంలో ఎట్లా ఉన్నానో తెలియదు. రెండూ నేను అనుభవించడం లేదు. ఏ పరిస్థితులలోనూ ఎరుకలేని స్థితి ఇంతవరకు నా అనుభవంలో లేదు.

192. రజ్జు సర్పభ్రాంతి అనేది కూడా పామూ తాడూ రెండూ తెలిసిన వాడికే గదా. ఏదో ఒకటి తెలిస్తే భ్రాంతీ లేదు. భ్రమా లేదు. అక్కడ రెండూ ఉన్నప్పుడే రెండు విషయాలు తెలిసి కనబడేది. అవినాభావ సంబంధం అన్నా కనబడేది. చూచేవాడు ఒక దానికొక సంబంధం ఉన్నదనుకొన్నప్పుడు కూడా కనబడేది చూచేవాడు ఉంటేనే అవినాభావ సంబంధం. నేను దాని అర్థాన్ని వేరుగా చెప్పుతున్నా ననుకొంటున్నారు. ఒక దాని కొకటి సంబంధం అని వాళ్ళన్నారు. కనబడేది చూచే వాడిని బట్టే అని నేనంటున్నాను. అంటే అక్కడ ఒక వస్తువున్నది. నా కళ్ళు పచ్చగా ఉన్నప్పుడు పచ్చగా కనబడవచ్చు. అంత మాత్రం చేత వస్తువు పచ్చబడలేదు. అంటే ఆ కనబడేది. ఎప్పుడూ కూడా నా భావానికి సంబంధించినట్టే కనబడుతుంది. మేఘం కోతి లాగా కనబడుతుంది. ఒకడికది సింహంలాగా కనబడుతుంది. అది మేఘమే కాని కోతి గాదు. సింహమూ కాదు. మన ఊహలే. అవి అన్నీ మనం చూచాం కనుక పోల్చుకుంటున్నాం. కోతిలాగా అన్నావు కాని కోతి ఉన్నదన లేదు. కోతి ఉన్నదంటే నీకు తెలియదనుకొంటాను. తెలియలేదనుకొంటాను. కోతే అని నీవన గలిగితే నీకు భ్రమ లేదు. మేఘ మెందుకు ? కోతే. ఒక దానిని చూచి మరొకటి అనుకొనేటప్పుడు. భావం తెలియనప్పుడు ఊహ, భ్రమ, అభిప్రాయమన్నా రెండూ తెలిసిన వాడికి కలుగుతుంది. పిల్లవాడు పాముతో ఆడుకొంటాడు. తల్లి పిల్ల వాడిని తీస్తుంది. కరుస్తుందిరా నాయనా అంటుంది. పిల్లవాడు భయపడడు. వాడికి తెలియదు. కుక్కనోట్లోనూ చేయి పెడతాడు. పాము నోట్లోనూ చేయి పెడతాడు.

ద్వంద్వమే దీనికి కారణం. తెలుసుకోవడానికి కారణం ద్వంద్వమే. భయానికి కారణం ద్వంద్వమే. ప్రతిదీ రెండవదిగా మారినప్పుడే గుర్తించడం, అనుకోవడమూనూ.

193. ఊహించడానికి ఒక శక్తి కావలసివచ్చింది. ఆ శక్తినే మనస్సు అంటాను. మనస్సు అంటే ఆలోచించే శక్తి. ఒకడికి కాదనిపించే శక్తి ఒకడికి ఔను అనిపించే శక్తి. ఒకరి మనస్సు క్రమపద్ధతిగా నడుస్తున్నది. ఇంకొకరి దగ్గర ఇంకొక రకంగా నడుస్తున్నది. ఈ అందరికీ ఊహించడానికి ఆలోచించడానికి ఏర్పరచిన మనస్సు ఏదైతే వున్నదో అలా ఆలోచించగల శక్తే క్రమము అనుకొంటున్నాను. ఒకప్పుడు ఒక ఆలోచన వచ్చింది. మరొకప్పుడు ఇంకొక ఆలోచన ఉన్నది. ఆలోచనలకు సమాధానాలు ఆలోచనలు వచ్చినవే చెబుతున్నది. ఇక్కడ ఏ శక్తి ఉన్నదో నేను చెప్పుతున్న సమాధానాలన్నీ ఏమి చెప్పుతున్నా వచ్చే ప్రశ్నలన్నిటికీ సమాధానాలు చెప్పే ఆ మనస్సుకు శక్తి తప్ప రూపంలేదు. ఈ మనస్సు అనేది అందరి దగ్గర వున్నది. అందరూ తలా ఒక పని చేస్తూ ఉన్నారు. ఏ శాస్త్రాలు గమనించామన్నా, ఏం కాదు. ఏం ఔను అన్నా, ఏ సిద్ధాంతాలు గుర్తించామన్నా ఏ శాస్త్రాలు కాదన్నా ఏ భౌతిక శాస్త్ర జ్ఞానమైనా మనస్సు పైనే ఆధారపడి వున్నది. ఆ మనస్సు సర్వశక్తి సంపన్నురాలు అనుకొంటున్నాను. మనస్సు చేత పదార్థాన్ని గుర్తిస్తున్నాం. ఆ పదార్థాన్ని మనస్సు ద్వారానే ఉపయోగించుకోగలుగుతున్నాం. పదార్థం తక్కువది అనను. పదార్థం వుంటేనే మనస్సుకు వచ్చిన ఆలోచన ఉపయోగపడుతుంది. మనస్సు పదార్థం ఒకటేనని నేను అనుకోవచ్చు. మనస్సు లేకపోతే పదార్థం అర్థం చేసుకోలేం. పదార్థం లేకపోతే మనస్సు ఆ పని చేయలేదు. మనస్సూ పదార్థమూ ఒకటే.

194. నా దృష్టిలో అన్ని వేళలా మంత్రం జపించవచ్చు. మనస్సే ఆహుతి చేస్తే ఇంకా వేరే ఆహుతి ఎందుకు. అన్నింటికీ మనస్సేగా ముఖ్యం. మనం దూరంగా ఉన్నప్పుడు (స్త్రీలు) రోజూ చేసుకొనే మంత్రంగాని జపంగాని ఆ మూడు రోజులూ చేయవద్దంటారు. పైకి ఉచ్చరించనంత మాత్రాన మనస్సులో జపించకుండా ఉండలేం కదా. జిల్లెళ్ళమూడికి దూరంగా ఉన్నప్పుడు అమ్మను చూడనంత మాత్రాన మనస్సులో అమ్మ రూపం ఉండకుండా ఉంటుందా ?

195. సందేహమే అనాచారం. శ్రద్ధా భక్తులతో పాకీ దొడ్లో చేస్తే మటుకు ఏం ? నా దృష్టిలో ఎక్కడున్నా ఒకటే. చెయ్యడం ప్రధానం. పాయిఖానా దొడ్డి వేరైనది కాదు. అది మన కడుపులోదే. శ్రద్ధ భక్తి కంటే వేరైనది ఏమున్నది. సర్వత్రా, గుర్తుండాలి కాని అంతకంటే ఏం కావాలి.

196. అసలును అసలైన వాడే అర్థం చేసుకొంటాడు. అవతారం ఎప్పుడైతే అవసరమైందో అది లీల అనీ ఆట అని అంటారు. రూపం వచ్చేటప్పటికి (భగవంతుడు కూడా) బద్ధుడౌతాడు. రూపం ఎప్పుడైతే కావలసి వచ్చిందో అప్పుడు నిర్ణయానికి బద్ధుడు కావలసిందే.

197. ఉద్రేకపడని కాలం గుర్తుండదు. ఉద్రేకమంటే కోపమేగా. ఉద్రేకం పనికి రాదన్నాం గనుక బాధగా వుంటుంది. బాధా ఉద్రేకమే. శాంతీ ఉద్రేకమే. ప్రేమా ఉద్రేకమే. నిప్పు ఎంత గొప్పదైనా కట్టెలు లేనప్పుడు మండదు. వాడి కరుణేగాని మనదేం లేదు. ఈ సుందరమైన దృష్టిలో భాగాలన్నీ ఎలాగో ఈ ఉద్రేకాలు కూడా అంతే. ఈ జన్మ నిచ్చినవాడే ఉద్రేకాలు కూడా ఇస్తున్నాడు. అసలు ఆకారమే వికారంతో వచ్చింది. వికారమనేది


వాడి వికారమేననుకొంటాను. వాడి వికారమే గాని మన వికారం లేదని నా ఉద్దేశం.

అసతో మా సద్గమయ
తమసో మా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతం గమయ
ఓం శాంతిః శాంతిః శాంతిః


"నీకున్నది తృప్తిగా తిని, ఇతరులకు ఆదరంగా పెట్టుకో."

"నీ బిడ్డయందు ఏమి చూస్తున్నావో అందరి యందూ అంతటా దానిని చూడటమే బ్రహ్మ స్థితిని పొందటం."


జయహో మాతా! శ్రీ అనసూయా!
రాజరాజేశ్వరి! శ్రీ పరాత్పరి!



రచయిత శ్రీ కోన వెంకటేశ్వరరావుకు
యజ్ఞోపవీతం వేసి ఉపదేశం చేస్తున్న అమ్మ



రచయిత చెల్లెలు అమ్మాకుమారి పెళ్లికిముందు
అమ్మను పూజిస్తున్న దృశ్యం



అక్క వసుంధరను వివాహం చేసుకున్న అమ్మ



అన్న గారు డా॥ కోన సత్యనారాయణకు ప్రసాదం తినిపిస్తున్న అమ్మ



కోన వెంకటేశ్వరరావు

జననం : 29-2-1952

అమ్మలో ఐక్యం : 20-12-2015

తల్లి	:	వెంకాయమ్మ
తండ్రి	:	వెంకట సుబ్బారావు
జననం	:	చీరాల, ప్రకాశం జిల్లా.
విద్య	:	బి.కాం. బి.యల్.,
వృత్తి	:	న్యాయవాది
		పొన్నూరు, బాపట్ల, తెనాలి, గుంటూరు
ప్రవృత్తి	:	ఊహ తెలిసినప్పటి నుండి జిల్లెళ్ళమూడి అమ్మ సన్నిధిలో, తల్లి దండ్రులతో, అక్క,అన్న, చెల్లెలితో కలసి జీవనం. సంస్థ అభివృద్ధికి కృషి, అమ్మ సాహిత్య అధ్యయనం.
రచనలు	:	తనుమూలమిదం జగత్, సహస్రసూత్రధారిణి, జ్ఞానమయి అమ్మ.